సొంతింట్లో తొలి దీపావళి

- ఇందిరమ్మ కుటుంబాల్లో పండుగ వెలుగులు!
- లబ్ధిదారుల ఇళ్లలో పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్: బ్యూరో, నవంబర్ 7 (ప్రజాజ్యోతి) సొంతింటి కల సాకారమై.. తమ ఇంట్లో తొలి దీపావళి జరుపుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో పండుగ వెలుగులు నిండాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి


ప్రతి అక్షరం ప్రజల కోసం

కరీంనగర్

జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి

ఆదివారం | 8 | నవంబర్ | 2026 ◆ పేజీలు : 12

- శిక్షణ పేరుతో ఫీజుల వసూళ్లు.. ఐఎస్ఓ సర్టిఫికెట్ల ప్రచారం
- ఉద్యోగం గ్యారంటీ అంటున్న కన్సల్టెన్సీలు.. నిజంగా విదేశాల్లో ఖాళీలు ఉన్నాయా?
- రీల్స్‌లో భారీ జీతాల హామీలు.. ఒప్పందంలోనూ అవే వివరాలుంటాయా?



విదేశీ ఉద్యోగాల పేరుతో యువతకు వల!

కోరుట్ల నవంబర్ 07 ప్రజాజ్యోతి గల్ఫ్ దేశాలు, యూరప్‌లో ఉద్యోగాలు సంపాదించాలనే ఆశతో ఉన్న నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని కొత్త కొత్త కన్సల్టెన్సీలు పుట్టుకొస్తున్నాయి. సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన వీడియోలు, రీల్స్ ద్వారా ప్రచారం చేస్తూ యువతను ఆకట్టుకుంటున్నాయి. ముందుగా కొంత ఫీజు చెల్లిస్తే ఇంగ్లీష్, అరబిక్, జర్మన్ భాషలతో పాటు ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, హోటల్ రంగాల్లో శిక్షణ ఇస్తామని చెబుతున్నాయి. కోర్సు పూర్తయిన తర్వాత ఐఎస్ఓ సర్టిఫికెట్ కూడా అందిస్తామని ప్రచారం చేస్తున్నాయి.అయితే అసలు ప్రశ్నలు ఇక్కడే మొదలవుతున్నాయి. ఈ శిక్షణ కేంద్రాలకు నిజంగా గుర్తింపు ఉందా? ఇస్తామంటున్న ఐఎస్ఓ సర్టిఫికెట్ అభ్యర్థికి ఇచ్చే నైపుణ్యం ధ్రువీకరణ పత్రమా? లేక శిక్షణ కేంద్రానికి ఉన్న గుర్తింపునా? శిక్షణ పూర్తయిన తర్వాత విదేశాల్లో ఉద్యోగం కల్పిస్తారా? కల్పిస్తే ఏ కంపెనీలో, ఏ దేశంలో, ఎన్ని ఖాళీలు ఉన్నాయి? ఉద్యోగానికి సంబంధించిన అధికారిక పత్రాలు ఉన్నాయా? అనే విషయాలపై స్పష్టత అవసరం.

ఐఎస్ఓ సర్టిఫికెట్ అంటే ఉద్యోగ అర్హత వచ్చినట్టేనా?

కొన్ని కన్సల్టెన్సీలు ఐఎస్ఓ సర్టిఫికెట్ ఇస్తామని ప్రచారం చేస్తున్నాయి. అయితే ఐఎస్ఓ ధ్రువీకరణ సాధారణంగా ఒక సంస్థ నాణ్యత నిర్వహణ విధానాలకు సంబంధించినది. ఆ సర్టిఫికెట్ ఉన్న శిక్షణ కేంద్రంలో కోర్సు చేసినంత మాత్రాన అభ్యర్థికి ప్రభుత్వ గుర్తింపు పొందిన నైపుణ్య అర్హత వచ్చినట్లు కాదు. కాబట్టి సర్టిఫికెట్

మిగతా 2 లో...

దీపావళివేడుకల్లో అప్రమత్తంగా ఉండాలి



6 లో...



బావి వద్దకు వైద్యారోగ్యశాఖ అధికారులు!

- బావిలో పడేసిన మందులపై ఆరా.. నమూనాల సేకరణకు చర్యలు
- మందులు ఏ శాఖకు చెందినవి..? ఎవరు పడేశారు..?
- 2023–24 సంవత్సరాలకు చెందినవిగా ప్రాథమిక గుర్తింపు
- మందుల గడువు ముగిసిందా..? ఇంకా వినియోగ గడువు ఉందా..?

ప్రజాజ్యోతి కథనానికి స్పందన...!



2 లో..

- కార్మికులతో బావిలోని మందుల నమూనాల సేకరణ
- విచారణ అనంతరం డీఎంహెచ్ఓకు సమగ్ర నివేదిక



సొంతింట్లో తొలి దీపావళి

(మొదటి పేజీ తరువాయి...)

లబ్ధిదారుల ఇళ్లలో పండుగ వాతావరణం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఐడీఓసీలోని తన ఛాంబర్‌లో అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాలతో ప్రజాప్రతినిధులు, అధికారులు మమేకమై దీపావళి వేడుకల్లో పాల్గొనాలని సూచించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి పండుగను జరుపుకోవాలని తెలిపారు.సొంతింటి సంతోషాన్ని పండుగ సంబరాలతో పంచుకునేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని, ప్రతి లబ్ధిదారుడి కుటుంబంలో ఆనందం వెల్లివిరిసేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి.శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ స్వామి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఆభరణాల కోసం వృద్ధురాళ్ల హత్యలు

► నలుగురు నిందితుల అరెస్ట్.. మరొకరు పరారీ





కరీంనగర్ క్రైం, నవంబర్ 07, (ప్రజాజ్యోతి) : తిమ్మాపూర్ మండలం వచ్చనూర్ గ్రామంలో ఇద్దరు వృద్ధురాళ్లను ఆభరణాల కోసం ఊపిరాడకుండా చేసి హత్య చేసిన కేసును పోలీసులు ఛేదించారు.ఈ ఘటనలకు సంబంధించి నలుగురు నిందితులను శనివారం అరెస్టు చేయగా, మరొకరు పరారీలో ఉన్నారు.పోలీసుల కథనం ప్రకారం.. వచ్చనూర్‌కు చెందిన ఉప్పులేటి భూదమ్మ (103)ను ఆగస్టు 16న, ఉప్పులేటి లక్ష్మి అలియాస్ లచ్చవ్వ (80)ను అక్టోబరు 31న నిందితులు హత్య చేశారు. వారి ఒంటిపై ఉన్న బంగారు,వెండి ఆభరణాలను దోచుకెళ్లారు.తొలి హత్యను సహజ మరణంగా భావించడంతో నిందితులు రెండో హత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.దొంగిలించిన ఆభరణాలను కరీంనగర్, హైదరాబాద్‌లో విక్రయించి నగదును పంచుకున్నారు.కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాలతో ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేపట్టి అలుగునూర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీల సమయంలో ఇద్దరిని పట్టుకున్నారు. వారి విచారణతో మరో ఇద్దరిని అరెస్టు చేశారు.అరెస్టయిన వారిలో మద్దూరి సాయి (24),కిన్నెర రాజు (25), ఎల్కతుర్తి రాజు (25), మానుకోల పవన్‌కుమార్ అలియాస్ జాక్ (28) ఉన్నారు. కనపర్తి మణికంఠ (28) పరారీలో ఉన్నాడు.నిందితుల నుంచి టీవీఎస్ జూపిటర్ స్కూటీ, బజాజ్ పల్సర్ బైక్, వెండి కడియాలు, ఐదు సెల్‌ఫోన్లు, ఇనుప గొట్టం, స్టీల్ పట్టుకారు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని సీపీ అభినందించారు.ఒంటరిగా నివసించే వృద్ధుల భద్రతపై కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని,విలువైన ఆభరణాలు ధరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు.గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.<

ఎమ్మెల్యే కృషితో కొండగట్టు లిఫ్ట్ ఇరిగేషన్‌కు లైన్ క్లియర్!

► లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.21.20 కోట్లు మంజూరు

కొడిమ్యాల,నవంబర్ 7,(ప్రజాజ్యోతి): కొండగట్టు ప్రాంతంలో ఏళ్లుగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయన కృషితో కొండగట్టు లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.21.20 కోట్లు మంజూరు చేస్తూ ఈ నెల 6న జీవో నంబర్ 545 జారీ చేసింది.ఇందిరమ్మ వరద ప్రవాహ కాలువ నుంచి 81వ కిలోమీటరు వద్ద నీటిని ఎత్తిపోసి కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానానికి తాగునీరు అందించడంతోపాటు ముత్యంపేట సమీపంలోని సంతల్లోద్ది చెరువును అభివృద్ధి చేయనున్నారు. ఈ పథకం అమలైతే కొండగట్టు భక్తుల నీటి అవసరాలు తీరడంతోపాటు కొడిమ్యాల మండలంలోని జేఎన్టీయూ నాచుపల్లి, దబ్బతిమ్మాయిపల్లి, హిమ్మత్‌రావుపేట, చింతలపల్లి, రాంసాగర్ తదితర గ్రామాలకు మేలు జరగనుంది.గ్రామీణ ప్రాంతాల తాగునీటి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చేస్తున్న ప్రయత్నాల్లో ఈ పథకం కీలకంగా మారనుందని, ప్రభుత్వ అనుమతులతో త్వరలోనే పనుల దిశగా అడుగులు పడతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విదేశీ ఉద్యోగాల పేరుతో యువతకు వల !

(మొదటి పేజీ తరువాయి...)

ఎవరి పేరుతో ఇస్తారు? దాన్ని ఏ సంస్థ జారీ చేస్తుంది? విదేశీ కంపెనీలు దాన్ని అంగీకరిస్తాయా? అనే విషయాలను ముందుగానే తెలుసుకోవాలి.

శిక్షణ ఇస్తున్నవారికి అర్హతలున్నాయా?

ఇంగ్లీష్, అరబిక్, జర్మన్ భాషలు నేర్పించే వారికి తగిన అర్హతలు, అనుభవం ఉన్నాయా? ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, హోటల్ రంగాల్లో శిక్షణ ఇచ్చేవారికి పని అనుభవం ఎంత? కోర్సు ఎన్ని రోజులు ఉంటుంది? ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారా? అనే వివరాలు తెలుసుకోవాలి.స్కిల్ ఇండియా, ఎన్ఎస్‌డీసీ గుర్తింపు ఉందని చెబితే సంబంధిత అధికారిక పత్రాలను పరిశీలించాలి. ఏ కోర్సుకు, ఏ శిక్షణ కేంద్రానికి గుర్తింపు ఉందో స్పష్టంగా నిర్ధారించుకోవాలి.

ఉద్యోగం ఇప్పిస్తామంటే కంపెనీ వివరాలేవి?

శిక్షణ ఇవ్వడం ఒకటైతే, విదేశాల్లో ఉద్యోగం కల్పించడం మరో విషయం. విదేశీ కంపెనీల తరపున అభ్యర్థులను నియమించి పంపే రిక్రూటింగ్ ఏజెంట్లకు విదేశాంగ శాఖ నిబంధనల ప్రకారం అవసరమైన నమోదు ఉండాలి.ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పే సంస్థలు ఏ దేశంలో ఏ కంపెనీలో ఉద్యోగాలు ఉన్నాయో వెల్లడించాలి. ఎన్ని ఖాళీలు ఉన్నాయి? కంపెనీ నుంచి అధికారిక డిమాండ్ లెటర్ వచ్చిందా? నియామక బాధ్యతలు చేపడుతున్న ఏజెంట్ నమోదు నంబరు ఏమిటి? అనే వివరాలు చూపించాలి.

రీల్స్‌లో చెప్పే జీతాలు నిజమేనా?

సోషల్ మీడియాలో కొందరు ఆకర్షణీయమైన వీడియోలతో విదేశీ ఉద్యోగాల గురించి ప్రచారం చేస్తున్నారు. నెలకు భారీ జీతాలు, ఉచిత వసతి, భోజనం, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని చెబుతున్నారు.అయితే వీడియోల్లో చెప్పే జీతం నిజంగా ఉద్యోగ ఒప్పందంలో ఉంటుందా? రోజుకు ఎన్ని గంటలు పని చేయాలి? ఓవర్‌టైమ్ సౌకర్యం ఉందా? వసతి, భోజనం ఎవరు కల్పిస్తారు? వీసా ఖర్చులు ఎవరు భరిస్తారు? అనే విషయాలు ముందుగానే తెలుసుకోవాలి. ప్రచార వీడియోలు చూసి మాత్రమే డబ్బులు చెల్లించడం ప్రమాదకరం.

ఫీజు ఎంత? ఉద్యోగం రాకపోతే డబ్బులు తిరిగిస్తారా?

శిక్షణ కోసం ఎంత ఫీజు తీసుకుంటారు? ఉద్యోగం ఇప్పించేందుకు అదనంగా ఎంత వసూలు చేస్తారు? ఉద్యోగం రాకపోతే చెల్లించిన డబ్బులు తిరిగి ఇస్తారా? రీఫండ్ నిబంధనలు ఏమిటి? అనే వివరాలను రాతపూర్వకంగా తీసుకోవాలి.ప్రతి చెల్లింపునకు తప్పనిసరిగా రసీదు పొందాలి. మాటలపై నమ్మకంతో కాకుండా, అన్ని వివరాలు పత్రాల్లో ఉన్నాయో లేదో పరిశీలించిన తర్వాతే డబ్బులు చెల్లించాలి.

టూరిస్ట్ వీసాపై వెళ్లి పని చేయొచ్చా?

విదేశీ ఉద్యోగాల కోసం ప్రయత్నించే యువతకు ముఖ్యమైన హెచ్చరిక ఇది. టూరిస్ట్ వీసాపై వెళ్లి అక్కడ ఉద్యోగం చూసుకోవచ్చని ఎవరైనా చెబితే నమ్మకూడదు.ఉద్యోగానికి తగిన వీసా, అధికారిక ఉద్యోగ ఒప్పందం ఉండాలి. వీసా రకం, ఉద్యోగం, కంపెనీ వివరాలను ముందుగానే ధ్రువీకరించుకోవాలి.

అధికారుల పర్యవేక్షణ అవసరం

విదేశీ ఉద్యోగాల పేరుతో శిక్షణ, కన్సల్టెన్సీ, ఉద్యోగ నియామకాలు చేపడుతున్న సంస్థల కార్యకలాపాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలి. నిజమైన నైపుణ్య శిక్షణ అందించే సంస్థలను ప్రోత్సహించాలి. ఉద్యోగ హామీల పేరుతో తప్పుడు ప్రచారం చేస్తూ యువత నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

యువత అప్రమత్తంగా ఉండాలి!

విదేశాల్లో ఉద్యోగం సంపాదించాలనే ఆశతో తొందరపడి డబ్బులు చెల్లించవద్దు.సంస్థకు ఉన్న గుర్తింపు, శిక్షకుల అర్హతలు, కోర్సు వివరాలు, సర్టిఫికెట్ విలువను ముందుగా తెలుసుకోవాలి. ఉద్యోగం ఇప్పిస్తామని చెబితే కంపెనీ పేరు,జీతం,వీసా,ఉద్యోగ ఒప్పందం, రిక్రూటింగ్ ఏజెంట్ నమోదు వివరాలు పరిశీలించాలి.

బావి వద్దకు వైద్యారోగ్యశాఖ అధికారులు!

కోరుట్ల,నవంబర్ 07 ప్రజాజ్యోతి ప్రజాజ్యోతి వార్తకు ఎట్టకేలకు వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించారు. రోగులకు పంపిణీ చేయాల్సిన మందులు, వైద్య సామగ్రిని కోరుట్ల పట్టణంలోని అయ్యప్ప గుట్ట సమీపంలో ఉన్న వ్యవసాయ బావిలో పడేసిన ఘటనపై అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. ఈ ఘటనపై ప్రజాజ్యోతిలో ప్రచురితమైన కథనం స్థానికంగా చర్చనీయాంశం కావడంతో వైద్యారోగ్య శాఖ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్ శనివారం ఘటనాస్థలాన్ని సందర్శించారు. బావిలో పడేసిన మందులు, కాలిపోయిన వైద్య సామగ్రి, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. బావిలో ఉన్న మందులు ఏ రకానికి చెందినవి,వాటి గడువు ఎప్పుడు ముగిసింది, ఏ శాఖ నుంచి వచ్చాయి అనే వివరాలను సేకరిస్తామని తెలిపారు.



మందులు ఏ శాఖకు చెందినవి..?

బావిలో కనిపించిన మందులు, సర్జికల్ వస్తువులు ఏ శాఖకు సంబంధించినవన్నది ప్రస్తుతం తేలాల్సి ఉంది. ప్రాథమికంగా అక్కడ లభించిన సామగ్రి 2023–2024 సంవత్సరాలకు చెందినదిగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అయితే వాటి తయారీ తేదీలు, వినియోగ గడువు, ఏ ఆసుపత్రి లేదా ప్రభుత్వ విభాగానికి చెందినవన్నది పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే స్పష్టత వస్తుందని పేర్కొన్నారు.

ఎవరు పడేశారు..? ఎప్పటి నుంచి పడేస్తున్నారు..?

ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించిన మందులు, వైద్య పరికరాలు వ్యవసాయ బావిలోకి ఎలా వచ్చాయి? వాటిని అక్కడ పడేసింది ఎవరు? ఎప్పటి నుంచి ఈ విధంగా పడేస్తున్నారు? గడువు ముగిసిన మందులేనా.. లేక వినియోగ గడువు ఉన్న మందులు కూడా ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. సంబంధిత సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరిస్తామని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

బావిలోంచి నమూనాలు సేకరిస్తాం!

బావిలో ఉన్న మందులు, వైద్య సామగ్రిని పరిశీలించేందుకు కార్మికులను పిలిపించి నమూనాలు సేకరిస్తామని అధికారులు వెల్లడించారు. మందులపై ఉన్న పేర్లు, గుర్తులు, ఇతర వివరాల ఆధారంగా వాటి వివరాలను గుర్తించే ప్రయత్నం చేస్తామన్నారు. సేకరించిన నమూనాలను పరిశీలించి పూర్తి సమాచారాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ)కి నివేదిస్తామని తెలిపారు.

తప్పు చేసిన వారిపై చర్యలు ఉంటాయా..?

ఈ ఘటనలో వైద్యారోగ్యశాఖ అధికారులు లేదా సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు విచారణలో తేలితే సంబంధిత వ్యక్తులను వివరణ కోరుతామని డాక్టర్ శ్రీనివాస్ చెప్పారు. వారి వివరణలు, సేకరించిన ఆధారాలు, విచారణలో వెల్లడైన అంశాలను డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తదుపరి చర్యలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉంటాయని స్పష్టం చేశారు.

వైద్య వ్యర్థాలను ఎలా పడేయాలి..?

ఆసుపత్రుల్లో వెలువడే వైద్య వ్యర్థాలను ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ పడేయకూడదని డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. వాటిని రకాలను బట్టి వేర్వేరుగా సేకరించి, నిబంధనల ప్రకారం వైద్య వ్యర్థాల నిర్వహణ సంస్థలకు అప్పగించాల్సి ఉంటుందన్నారు. ఇంట్లో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసినట్లుగానే ఆసుపత్రుల్లోనూ వైద్య వ్యర్థాలను వేరు చేయాలని వివరించారు. పునర్వినియోగానికి సంబంధించిన వ్యర్థాలు, గాజు వస్తువులు, శరీర భాగాలకు సంబంధించిన వ్యర్థాలను నిబంధనల ప్రకారం వేర్వేరు రంగుల సంచులు, పాత్రల్లో సేకరించాల్సి ఉంటుందని తెలిపారు.

ప్రజల ఆరోగ్యానికి ముప్పు!

వైద్య వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయడం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా వాటిని తొలగించే మున్సిపల్ కార్మికులు కూడా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు.అందువల్ల ప్రతి ఆసుపత్రి వైద్య వ్యర్థాల నిర్వహణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రభుత్వ మందులు బావిలోకి ఎలా చేరాయి? వాటిని అక్కడ పడేసింది ఎవరు? వాటిని కాల్చేందుకు ప్రయత్నించింది ఎవరు? అనే ప్రశ్నలకు సమాధానాలు ఇంకా తెలియాల్సి ఉంది. అధికారులు నమూనాలు సేకరించి నివేదిక సమర్పిస్తామని చెబుతున్న నేపథ్యంలో.. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిగి బాధ్యులెవరో తేల్చి, తగిన చర్యలు తీసుకుంటారా? అన్నది వేచి చూడాలి.



ప్రజాజ్యోతి కథనానికి స్పందన...!

ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- పల్లిమక్త గ్రామ సభలో వ్యవసాయ శాఖ అధికారి శ్రీదేవి అవగాహన.. రైతుల సమస్యలపై తీర్మానం

కోనరావుపేట,నవంబర్.07 (ప్రజాజ్యోతి)



రానున్న కాలంలో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు వ్యవసాయం, పంటల దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి శ్రీదేవి సూచించారు. కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో ఎల్‌నినో ప్రభావం, వ్యవసాయంపై దాని పరిణామాలు, నీటి లభ్యత, జలసిరి కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ జిన్న అనూష అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని, వీటి ప్రభావం పంటల సాగు, దిగుబడిపై పడుతుందని వివరించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు పంటల సాగులో తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు వ్యవసాయంలో నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలని తెలిపారు. వర్షపాతం అనుకూలంగా లేని పరిస్థితుల్లో పంటలకు నష్టం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే గ్రామంలో జలసిరి కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటిని ఒడిసిపట్టడం వంటి అంశాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి వనరులను సంరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా గ్రామస్థులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. వ్యవసాయానికి అవసరమైన నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని, నీటి పొదుపు పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని వివరించారు.

›» రైతుల సమస్యలపై గ్రామ సభలో తీర్మానం

గ్రామ సభలో రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నప్పటికీ, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందుల కారణంగా రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వరి ధాన్యం విక్రయించిన రైతులకు సంబంధించిన డబ్బులతో పాటు ప్రభుత్వం ప్రకటించిన బోనస్ మొత్తాన్నికూడా ఆలస్యం చేయకుండా వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సభలో తీర్మానం చేశారు. అనంతరం తీర్మాన ప్రతితో కూడిన వినతిపత్రాన్ని వ్యవసాయ శాఖ అధికారి శ్రీదేవికి అందజేశారు. రైతులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని గ్రామ సభలో పాల్గొన్న రైతులు కోరారు. వ్యవసాయ రంగంలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు రైతులకు అవగాహన కల్పించడం, నీటి వనరులను సంరక్షించడం, రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వసంపెల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు మొకనపెల్లి బాలరాజు, జిన్నా సమత అర్జున్, రేగుల పద్మ పరిశరములు, జాగిరి లక్ష్మి, చిద్రవేణి నరేష్, జాగిరి ఆనందం, జాగిరి కిరణ్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్, పంచాయతీ కార్యదర్శి, సింగిల్ విండో డైరెక్టర్, ఇరిగేషన్ అధికారి, విద్యుత్ లైన్మెన్, ఆశా వర్కర్, మహిళా సంఘం వీవోఏ, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

సౌత్ జోన్ చదరంగం పోటీలకు వినీల ఎంపిక



ఎలిగేడు నవంబర్ 07 (ప్రజాజ్యోతి) ఆదివారం హైదరాబాదులోని వాక్సన్ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ చదరంగం పోటీలకు ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన తాటిపల్లి వినీల ఎంపికైంది. ఇటీవల హైదరాబాదులోని జేఎన్టీయూలో జరిగిన సౌత్ జోన్ ఎంపికలో ప్రతిభ కనబరచి సౌత్ జోన్ కు ఎంపికైంది . వివిఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కాలేజీలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న వినీల కు పలువురు నాయకులు గ్రామస్తులు ప్రశంసించారు.

సబ్బితం గ్రామంలో మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే దాసరి పరామర్శ



పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 7, ప్రజాజ్యోతి: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన నూనెమల్లమ్మ, కనుకుంట్ల రాములు అనారోగ్యంతో మృతి చెందగా, వారి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మహేందర్, మెరుగు లింగయ్య, చందు, గుర్రాల సురేష్, కిష్టయ్య, మానుపాటి సాయి, మెరుగు సురేష్, ఇబ్రహీం తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

- డీఆర్ డీఓ అధికారికి వినతిపత్రం అందజేసిన బంధనకల్ సర్పంచ్ చిగురు నరేష్

ముస్తాబాద్: నవంబర్ 7 (ప్రజా జ్యోతి):రాజన్న సిరిసిల్ల జిల్లా డీఆర్ డీఏ అధికారి లక్ష్మీనారాయణను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి బంధనకల్ గ్రామంతో పాటు వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందించాలని కోరుతూ సర్పంచులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బంధనకల్ గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ మాట్లాడుతూ గ్రామంలో మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, మహిళలకు సమావేశాలు నిర్వహించేందుకు అనువుగా ఉండేలా మహిళా సంఘాల (వీవో) భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని డీఆర్ డీఏ అధికారిని కోరారు. మహిళా సంఘాల భవనాల నిర్మాణం పూర్తయితే గ్రామంలోని మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. అదేవిధంగా వివిధ గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు జిల్లా అధికారుల సహకారం అందించాలని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చికోడు గ్రామ సర్పంచ్ బొమ్మన అంజనేయులు, దునుకుల కర్ణాకర్ పాల్గొని తమ గ్రామాల్లోని వివిధ సమస్యలను డీఆర్ డీఏ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. సర్పంచులు అందించిన వినతులపై డీఆర్ డీఏ అధికారి లక్ష్మీనారాయణ సానుకూలంగా స్పందించారు. గ్రామాల అభివృద్ధికి జిల్లా అధికారుల తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచులకు హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని సర్పంచులు పేర్కొన్నారు.



2038 రోజులుగా నిరంతర అన్నదానం.. ఆకలిలేని సమాజమే లక్ష్యం

- దాతల సహకారంతో పేదలు, భక్తులకు మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సేవలు



వేములవాడ,నవంబర్,7 ప్రజాజ్యోతి: ఆకలితో అలమటించే పేదలకు, భక్తులకు అండగా నిలుస్తూ మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ గత 2038 రోజులుగా నిరంతర అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ సేవా స్ఫూర్తిని చాటుకుంటోంది. దాతల సహకారంతో కొనసాగుతున్న ఈ మహత్తర సేవా కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ ఎంతో మంది ఆకలితో ఉన్న వారి కడుపు నింపుతూ మానవత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ మాట్లాడుతూ.. సమాజంలో ఎంతోమంది పేదలు ఆకలితో ఇబ్బందులు పడుతున్నారని, మనకు ఉన్నదానిలో కొంత భాగాన్ని అవసరంలో ఉన్నవారికి పంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, పితృదేవతల స్మరణ వంటి శుభ సందర్భాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో పుణ్యప్రదమని పేర్కొన్నారు. నేటి అన్నదాతలుగా వేములవాడ మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన నక్క శ్రీకాంత్, సంతోష దంపతులు వ్యవహరించగా, అన్నదాన శాశ్వత దాతలుగా జువ్వాడి వెంకటేశ్వరరావు, స్నేహలత, ప్రతాప్, స్వప్న, సంపత్, నగుబోతు రవీందర్, జ్యోతి, గణాచారి, సాంబశివ్, శైలజ, దేవరాజు, ఉమ, బాలచందర్ రాజు, రామడుగు శ్రీలతతో పాటు వారి కుమారులు, కోడళ్లు ప్రజ్ఞ, శరత్ చంద్ర, శిరీష, సాయి చంద్ర, శర్వాణి, రవిచంద్ర దంపతులు, హైదరాబాద్‌కు చెందిన చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ తమ వంతు సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈ నిరంతర అన్నదాన కార్యక్రమానికి ఆర్థికంగా సహకరిస్తున్న ప్రతి దాతకు, ట్రస్ట్ సభ్యులకు, సేవలు అందిస్తున్న స్వచ్ఛంద సేవకులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. సేవా భావం కలిగిన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై ఆకలిలేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ మానవత్వాన్ని చాటుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పొలాస రాజేందర్, పసుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

- మాజీ జడ్పీటీసీ గంట రాములు యాదవ్
- 26వ రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె
- సమ్మెకు సంపూర్ణ మద్దతు.. సమస్యలు పరిష్కార మయ్యే వరకు అండగా ఉంటాం

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 7, ప్రజాజ్యోతి: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు చేపట్టిన సమ్మె 26వ రోజుకు చేరుకుంది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన లేకపోవడంతో ఉద్యోగులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట శనివారం నిర్వహించిన సమ్మె శిబిరాన్ని ఓదెల మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ నాయకుడు గంట రాములు యాదవ్ సందర్శించి ఉద్యోగులకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు చేరవేయడంలో నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగులు తమ న్యాయమైన హక్కులు, డిమాండ్ల సాధన కోసం 26 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో ఉద్యోగుల పక్షాన మరింత తీవ్రస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు బాల రామారావు, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సంఘం నాయకుడు మహేందర్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని తమ నిరసనను కొనసాగించారు.



అత్తను వేధించి ఆత్మహత్యకు కారణమైన కోడలు అరెస్ట్

- అనారోగ్యంతో మృతి చెందినట్లు నమ్మించే ప్రయత్నం
- పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వాస్తవాలు

ధర్మారం,నవంబర్ 7(ప్రజా జ్యోతి):ధర్మారం గ్రామంలో అక్టోబర్ 10న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన గంగాధర లక్ష్మి కేసులో పోలీసుల దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.అత్తను కొట్టడం, తిట్టడం, కనీసం తిండి కూడా పెట్టకుండా వేధించడంతో మనస్తాపానికి గురైన లక్ష్మి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర లక్ష్మి అనుమానాస్పద మృతిపై సింగిరెడ్డి రాజవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధర్మారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ క్రమంలో లక్ష్మి కోడలు గంగాధర పుష్పలత తరచూ ఆమెను కొట్టడం,తిట్టడం,భోజనం పెట్టకుండా వేధింపులకు గురిచేసినట్లు విచారణలో తేలింది. ఈ వేధింపులు భరించలేక జీవితంపై విరక్తి చెందిన లక్ష్మి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.అయితే ఈ విషయం బయటపడితే తనపై నిందలు వస్తాయనే ఉద్దేశంతో పుష్పలత తన భర్త వెంకటేష్‌తో కలిసి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందినట్లు నమ్మించే ప్రయత్నం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. పోలీసులు విచారించగా పుష్పలత తన నేరాన్ని అంగీకరించినట్లు ఎస్సై తెలిపారు.ఈ కేసులో లక్ష్మి మృతికి కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నే గంగాధర పుష్పలతను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ధర్మారం ఎస్సై ఎం.శ్రీకాంత్ వెల్లడించారు.

తంగళ్ళపల్లి మాజీ సర్పంచ్ కి మార్కెట్ కమిటీ దక్కేనా



తంగళ్ళపల్లి నవంబర్ 7 (ప్రజా జ్యోతి) :సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రేస్ లో కి మరో కొత్త నాయకుని పేరు. తంగళ్ళపల్లి మాజీ సర్పంచ్ ,25 సంవత్సరాల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆసాని సత్యనారాయణ రెడ్డి కి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కిన.పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడ్డ పార్టీ పెద్దలు నాకు అవకాశం ఇవ్వాలని కోరినట్టు సమాచారం.సానుకూలంగా పెద్దలు స్పందించినట్టు సమాచారం.పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడ్డ ఈ ఒక్క అవకాశం నాకు ఇవ్వాలని కోరుతున్నట్టు సోషల్ మీడియాలో వార్తలు.

ఐపీఎస్ పాఠశాలలో ఘనంగా దీపావళి వేడుకలు

- సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థుల సందడి



సుల్తానాబాద్, నవంబర్ 7(ప్రజా జ్యోతి)పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్ (ఐపీఎస్)లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో అందమైన రంగవల్లులు తీర్చిదిద్ది, దీపాలను వెలిగించి దీపావళి సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. విద్యార్థుల సందడితో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ మాటేటి కృష్ణప్రియ హాజరై విద్యార్థులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దీపావళి పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ఇటువంటి పండుగల నిర్వహణ ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు. దీపావళి పండుగను సంతోషంగా జరుపుకోవాలని, బాణసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సురక్షిత మైన దీపావళిని జరుపుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు.ఈ వేడుకల్లో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ సునీత ఉపాధ్యాయినులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

ముంపు పరిహారం, పునరావాసంపై చామనపల్లిలో గ్రామసభ

- ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పూర్తిస్థాయిలో అందించాలి
- గ్రామ ప్రజల మెజారిటీ అభిప్రాయం
- గ్రామాన్ని కటికనపల్లి రోడ్డువైపు ఏర్పాటు చేయాలని నిర్ణయం





ధర్మారం, నవంబర్ 7 (ప్రజా జ్యోతి): నంది మేడారం రిజర్వాయర్ ముంపు పరిహారం, పునరావాసం,నూతన గ్రామ నిర్మాణం తదితర అంశాలపై శనివారం ధర్మారం మండలం చామనపల్లిగ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచనల మేరకు సర్పంచ్ వేల్పుల రేవతి నాగరాజు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది.ఈ గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి గంగన్న గ్రామ ప్రజలకు ముంపు పరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ,నూతన గ్రామ ఏర్పాటు విధానంపై వివరించారు. అనంతరం గ్రామస్థుల అభిప్రాయాలను ఒక్కొక్కరిగా తెలుసుకొని,వారి అభ్యంతరాలు, సూచనలను నమోదు చేశారు.గ్రామసభలో చర్చించిన అంశాలపై గ్రామ ప్రజల మెజారిటీ అభిప్రాయం మేరకు పలు నిర్ణయాలు తీసుకున్నారు.

››› గ్రామసభలో ప్రధానంగా వెలువడిన నిర్ణయాలు:

1.గ్రామంలోని ప్రతి కుటుంబానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి సంబంధించిన అన్నిరకాల పరిహారాలు, ప్రభుత్వ జీవో ప్రకారం పూర్తిస్థాయిలో అందించాలని గ్రామస్థులు నిర్ణయించారు.
2.చామనపల్లి గ్రామాన్ని ప్రస్తుతం ఉన్న గ్రామానికి పైభాగంలో కటికన పల్లి వెళ్లే రహదారి పక్కన అనువైన ప్రాంతంలో పునర్నిర్మించే అంశాన్ని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.3,గతంలో నిర్వహించిన సామాజిక ఆర్థిక సర్వేలో కొన్ని చెట్లు, ప్రహరీ గోడలు, ఇంటి స్థలాలు, ఇతర ఆస్తుల వివరాలు నమోదు కాకపోయినట్లు గ్రామస్థులు అభిప్రాయపడ్డారు. అటువంటి ఆస్తులన్నింటినీ మరోసారి సమగ్రంగా సర్వే చేసి, ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని అధికారులను కోరారు.గ్రామ ప్రజల అభిప్రాయాలు, మెజారిటీ నిర్ణయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని సమావేశంలో వివరించారు.ఈ కార్యక్రమంలో మంత్రి ఆదేశాల మేరకు చింతల ప్రదీప్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడియా రూప్ల నాయక్, కొత్త నరసింహులు పాల్గొన్నారు. అలాగే ఇరిగేషన్ శాఖ అధికారి డి. వంశీధర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ తిగుళ్ల కవిత సతీష్ రెడ్డి,వార్డు సభ్యులు బుసరాజుల శ్రీనివాస్, మందపెల్లి సాయి, రాపెల్లి శ్రీకాంత్, బెదుగం హరిక అంజయ్య, నిట్టు లక్ష్మి రాయలింగు, తిగుళ్ల రవళి కిరణ్, దాసరి సాగర్, పంచాయతీ కార్యదర్శి కిరణ్,మాజీసర్పంచులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగులు

- గ్రామాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం
- ప్రతి నిరుపేదకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం
- గ్రామ సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్



››› గ్రామాభివృద్ధే ప్రధాన లక్ష్యం..



సుల్తానాబాద్, నవంబర్ 7 (ప్రజాజ్యోతి): ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురు చూసిన నిరుపేద కుటుంబాల కల ఇందిరమ్మ ఇళ్ల పథకంతో సాకారమైంది. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలో ఈ ఏడాది దీపావళి పండుగ పేదల ఇళ్లలో ప్రత్యేక వెలుగులు నింపుతోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన కాట్నపల్లిలో ఇప్పటికే సుమారు 70 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకొని సొంతింటిలో నివాసం ఉంటుండగా, మరికొన్ని ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలో కాలం వెళ్లదీసిన కుటుంబాలు ఈ సారి తమ సొంతింటిలోనే దీపావళి పండుగ జరుపుకోనున్నాయి. కొత్త ఇళ్లను దీపాలతో అలంకరించుకొని కుటుంబ సభ్యులతో పండుగ సంబరాలకు సిద్ధమవుతున్నారు

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపిందని, సొంతింటి కల నెరవేరడంతో వారి కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోందని పేర్కొన్నారు.కాట్నపల్లిని అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన,అంతర్గత రహదారులు,పారిశుద్ధ్యం,తాగునీరు,వీధి దీపాలు తదితర సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేస్తూ,ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకున్న కుటుంబాలతో పాటు, నిర్మాణ దశలో ఉన్న లబ్ధిదారులకు కూడా అవసరమైన సహకారం అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు.ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రత్యేక చొరవ, సహకారంతో కాట్నపల్లి గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని సర్పంచ్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామానికి మరిన్ని అభివృద్ధి పనులు తీసుకొచ్చి ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. పేదల ఇళ్లలో వెలిగే దీపావళి దీపాలు వారి జీవితాల్లో కొత్త ఆశలకు ప్రతీకగా నిలుస్తున్నాయని సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్ అన్నారు.

వన్ టైం సెటిల్మెంట్ కింద డిస్మిస్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- ఎస్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్



గోదావరిఖని, నవంబర్ 7 (ప్రజాజ్యోతి) :సింగరేణిలో పనిచేస్తు డిస్మిస్ అయిన యువ కార్మికులకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద మళ్లీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ ఎం ఎస్) జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు.శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సింగరేణిలో ఇప్పటి వరకు 600 మంది డిస్మిస్ అయిన కార్మికులు ఉన్నారని,అండర్ గ్రౌండ్‌లో పనిచేసే యువ కార్మికుల హాజరు శాతం లేని కారణంగా సింగరేణి యాజమాన్యం డిస్మిస్ చేసిందని తెలిపారు.ఏ ఐ టి యు సి చేసుకొన్న ఒప్పందం వల్లనే ఈ కార్మికులకు అన్యాయం జరుగుతుందని వాపోయారు.డిస్మిస్ అయినజేఏం ఈ టి ఉద్యోగులను వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద తీసుకున్నట్లుగానే మిగిలిన వారిని కూడా ఎలాంటి షరతులు లేకుండా వెంటనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రియాజ్ హెచ్చరించారు.విలేఖరుల ఈ సమావేశంలో నాయకులు సత్తి,నాగేందర్,డిస్మిస్ కార్మికులు కిరణ్, కార్తీక్, శ్రీనివాస్,ఆశోక్,హరీష్,రాందాస్,శ్రీకాంత్ వెంకటేష్ పాల్గొన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వ కుట్ర

- వంతపాడుతున్న ఏఐటీయూసీ ఐఎన్ టి యుసి
- టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి



గోదావరిఖని, నవంబర్ 7 (ప్రజాజ్యోతి)

సింగరేణి సంస్థను ప్రైవేటీకరించేందుకు రాష్ట్రప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి తీవ్రంగా విమర్శించారు.శనివారం యైటీంక్లెయిన్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఓసిపి 3 లో ప్రైవేట్ డ్రిల్లింగ్ మిషన్ అద్దె ప్రాతిపదికన తీసుకొని వచ్చారని, ప్రైవేట్ డ్రిల్లింగ్ మిషన్ నడపడం,మరమత్తు చేయడం అంతా ప్రైవేట్ వ్యక్తులకే అప్పగించారని ఆక్షేపించారు.రాష్ట్ర ప్రభుత్వం,సింగరేణి యాజమాన్యం చేపడుతున్న కాంట్రాక్టీకరణ,ప్రైవేటీకరణకు గుర్తింపు సంఘం ఏఐటీయుసి, ప్రాతినిధ్య సంఘం ఐ ఎన్ టి యు సి పూర్తిగా సహకరిస్తున్నట్లు ఈ చర్యలు సూచిస్తున్నాయని ఆయన ఆరోపించారు.యాజమాన్యం చేసే కుట్రపూరిత పనులకు గుర్తింపు,ప్రాతినిధ్య సంఘాలు వంతపాడడం సిగ్గుచేటని మండిపడ్డారు.2 డ్రిల్లింగ్ మిషన్లను కాంట్రాక్ట్ పద్ధతిలో వినియోగించడానికి టెండర్ ప్రక్రియ పూర్తయిందని,మరో నాలుగు డ్రిల్లింగ్ మిషన్లు తీసుకురావడానికి టెండర్ ప్రక్రియ కొనసాగుతున్నదన్నారు.రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు నియోజకవర్గంలోని రామగుండం ఓసిపి వన్ లో బండ, మట్టి తొలగింపు పనులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని,ఓసిపి వన్‌గని లో 1700మంది కార్మికులతో పనులు నడిచేవని, పెరిగిన ప్రైవేటీకరణ వల్ల 800 మంది కార్మికులు మాత్రమే పని చేస్తున్నారని చెప్పారు.ప్రణాళిక బద్ధంగా పనిచేయకపోవడం,దూరదృష్టిలోపం వల్ల రూ.వందల కోట్ల భారీ యంత్రాలు విడిభాగాల కొరత వల్ల పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కూలెంట్,ట్రాన్స్మిషన్ ఆయిల్, హైడ్రాలిక్ ఆయిల్,టైర్ల కొరత వలన భారీ యంత్రాలు పనిచేయడం లేదని తెలిపారు.కార్మికులు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ వారి సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.ఈ సమావేశంలో కార్మిక నాయకులు భేతి చంద్రయ్య, మామిడి తిరుపతి, దాసరి శ్రీనివాస్, శశాంక్, బి. శ్రీనివాస్, నరేందర్ మహేందర్, పి. శ్రీనివాస్, దినేష్, దక్షిణామూర్తి పాల్గొన్నారు.

జాన్సన్, కోరా ఎ.ఎన్.సి పాఠశాలల్లో ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు



కరీంనగర్ టౌన్, నవంబర్ 7 (ప్రజాజ్యోతి) జాన్సన్, కోరా హైస్కూల్, ఎ.ఎన్.సి పాఠశాలల్లో శనివారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాం రెడ్డి, సింహాచలం, హరికృష్ణ, వంగాల సంతోష్ రెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దీపావళి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.

సి ఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం



కరీంనగర్ టౌన్, నవంబర్ 7 (ప్రజాజ్యోతి) బీసీ కుల ఆత్మ గౌరవ భవనాల నిర్మాణాల్లో భాగంగా ఉప్పల్ భగాయత్ లే అవుట్ లో గంగపుత్ర భవనం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 5 కోట్ల రూపాయల నిధులు కేటాయించిన సందర్భంగా,ఈ రోజు కరీంనగర్ ఫిష్ మార్కెట్ లో ప్రదేశ్ కాంగ్రెస్ ఫిషరీస్ కమిటీ ప్రధాన కార్యదర్శి నాగుల సతీష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం కార్యక్రమానికి సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని గత కేసీఆర్ ప్రభుత్వం మాట ఇచ్చి తప్పిందని అన్నారు.ఈ కార్యక్రమంలో గుండాటి శ్రీనివాస్ రెడ్డి, గడప అజయ్,మార్క రాజాగౌడ్,మిరాజ్,భారీ,బషీర్ పాల్గొన్నారు.

నారాయణపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర పొందండి: సింగిల్ విండో చైర్మన్ దూలం బాల గౌడ్!



గంగాధర 07/నవంబర్/2026: (ప్రజా జ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, ప్రభుత్వం అధికారికంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాలగౌడ్ పిలుపునిచ్చారు.చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు, గంగాధర సింగిల్ విండో ఆధ్వర్యంలో మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామంలో శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దూలం బాల గౌడ్ మరియు గ్రామ సర్పంచ్ ధీకొండ బాబలక్షి – మధు రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ బాలగౌడ్ మాట్లాడుతూ.. ఐకేపీ మరియు సింగిల్ విండో కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కేంద్రాల వద్ద తాగునీరు, టార్పాలిన్లు,గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు.రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా, పారదర్శకంగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కేంద్రాల నిర్వాహకులకు మరియు అధికారులకు ఈ సందర్భంగా ఆయన కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంత్రి మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చన్న, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ పాల్గొన్నారు.అలాగే మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య, సర్పంచ్ల ఫోరమ్ మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, సర్పంచ్లు కోలేపాక కవిత – మల్లేశం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాగి అజయ్ రావు, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, రేండ్ల రాజి రెడ్డి, ఆకుల అంజయ్య, జారతి సత్తయ్య, కడారి కుమారస్వామి, పెద్దోళ్ల రాజేశంలతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు మరియు నారాయణపూర్ పరిసర ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాల పంపిణీ



గంగాధర 07/నవంబర్/2026: (ప్రజా జ్యోతి): గంగాధరలో శనివారం రైతులకు సబ్సిడీపై మొక్కజొన్న విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు పంపిణీ చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ సబ్సిడీపై "తెలంగాణ మక్కా"(డిహెచ్ఏం–206) రకం మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఆర్.శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తిగల రైతులు తమ పట్టాదారు పాస్బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించి వీటిని పొందవచ్చన్నారు. ఏఈఓలు వెంకట్, గోపీచంద్, గోవర్ధన్, హిమ్మత్ నగర్ సర్పంచ్ బీర్ల ఆనందం, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విజన్ హై స్కూల్ లో ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు

- విజన్ హై స్కూల్ కరెస్పాండెంట్ సిరిపురం ప్రసాద్





కొత్తపల్లి నవంబర్ 7, (ప్రజా జ్యోతి)ఈ రోజు కరీంనగర్ లోని విజన్ హై స్కూల్ లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమాన్నీ స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ గారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.. ఈ సందర్భంగా విద్యార్థులు అందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి స్కూల్ కు విచ్చేసి రకరకాల దీపాలతో స్కూల్లో దీపాలంకరణ చేసి, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు చేసిన నృత్యాలు, నాటిక అందరిని అలరించాయి. స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ గారు మాట్లాడుతూ విద్యార్థులందరూ టపాసులకు దూరంగా ఉంటూ వాతావరణము కాపాడుతూ గ్రీన్ దీపావళిని జరుపుకోవాలని కోరడం జరిగింది. మరియు విద్యార్థులు అందరి చేత గ్రీన్ దీపావళి జరుపుకోవాలని ప్రతిజ్ఞ చేపించడం జరిగింది. అదేవిధంగా విద్యార్థిని విద్యార్థులందరికీ వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు, శ్రేయోభిలాషులందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సందవేణి వెంకట్ ,ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చర్లపల్లి (ఆర్) లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- అన్నదాతలారా.. ప్రభుత్వ కేంద్రాలనే ఆశ్రయించండి!
- దళారుల ఉచ్చులో పడొద్దు.. ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోండి: సర్పంచ్ ఎట్టపు కనకయ్య



గంగాధర 07/నవంబర్/2026: (ప్రజా జ్యోతి): గంగాధర మండల పరిధిలోని చర్లపల్లి (ఆర్) గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం అధికారికంగా ప్రారంభమైంది. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు కెడిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ ఎట్టపు కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కనకయ్య మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు తక్కువ ధరకు అమ్మి మోసపోకుండా, ప్రభుత్వం కల్పించే కనీస మద్దతు ధరను పొందడానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలనే సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఐల్లయ్య, కార్యదర్శి శేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో బాలుడి పుట్టినరోజు వేడుకలు



చిగురుమామిడి /నవంబర్ 07 ప్రజాజ్యోతి చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలోని చింతలపల్లి అంగన్వాడి కేంద్రంలోని బాలుడి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.గ్రామానికి చెందిన ఎంబరి కల్పన–సంపత్ దంపతుల కుమారుడు ఎంబరి రియాన్స్ పుట్టినరోజు,సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలోని పిల్లల సమక్షంలో బాబు రియాన్స్‌తో కేక్ కటింగ్ చేయించారు.అనంతరం కల్పన–సంపత్ దంపతులువారి స్వంత ఖర్చులతో అంగన్వాడీకేంద్రంలోని చిన్నారులందరికీ భోజన ప్లేట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ గాండ్ల ఇందిర,చిన్నారులు పాల్గొన్నారు.

దీపావళి పర్వదినం సందర్భంగా శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు





వేములవాడ,నవంబర్:7:ప్రజాజ్యోతి. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక ఆశ్వయుజ మాస బహుళ చతుర్దశి అయిన నరక చతుర్దశి సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు, సేవలు నిర్వహించనున్నారు. తొలుత మంగళవాయిద్యాల నడుమ సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం స్వామివారికి నిత్యప్రాతఃకాల పూజలు,మధ్యాహ్నిక పూజలు,నివేదనలు సమర్పిస్తారు. సాయంత్రం ప్రదోష వేళలో స్వామివారికి ప్రత్యేక అర్చన నిర్వహించడంతో పాటు దేవస్థానంలో అంతరంగికంగా మహాలక్ష్మి పూజను వైభవంగా నిర్వహిస్తారు. పూజల అనంతరం హరిహరులను అంబారీ సేవపై గ్రామంలో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారికి నిశీ పూజ, ఏకాంత సేవలతో పర్వదిన వేడుకలు ముగుస్తాయి. బలిపాడ్యమి నుంచి యమద్వితీయ వరకు ప్రతి ఇంటిలోనూ సాయంత్రం వేళ దీపారాధనలు చేయడం శాస్త్రోక్తమని అర్చకులు తెలిపారు. కార్తీక మాసం ప్రారంభం నుంచి వరుసగా ముప్పై రోజుల పాటు దేవస్థానంలో దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా అమావాస్య రోజున సాయంత్రం ప్రదోష వేళలో మహాలక్ష్మి పూజకు విశేష ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు మాట్లాడుతూ జగజ్జనని మహాలక్ష్మి అమ్మవారు సకల జనులకు ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలు,సుఖసంతోషాలు ప్రసాదించాలని,లోకంలోని ప్రజలందరినీ చల్లగా చూడాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

దీపావళివేడుకల్లోఅప్రమత్తంగా ఉండాలి

- చందుర్తి సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె రవీందర్



వేములవాడ,నవంబర్,7:ప్రజాజ్యోతి. <చందుర్తి, కోనరావుపేట్, రుద్రంగి మండల ప్రజలు సురక్షితమైన దీపావళి జరుపుకోవాలిసురక్షిత వేడుకలే నిజమైన ఆనందం తగిన జాగ్రత్తలు పాటిస్తూనే పండుగను సంతోషంగా జరుపుకోవాలి. చిన్న చిన్న నిర్లక్ష్యాలు వద్దు టపాసులు కాల్చేటప్పుడు అజాగ్రత్త వహిస్తే ఊహించని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. *ప్రభుత్వ అనుమతి పొందిన షాపుల్లోనే బాణాసంచా కొనుగోలు చెయ్యండి ప్రభుత్వ అనుమతి తో మాత్రమే బాణసంచ విక్రయాలు జరపాలి, అన్నీ నిబందనల తో, జాగ్రతల తో మాత్రమే షాప్ నిర్వహణ జరగాలి, లేని చో యజమాని బాధ్యుడు అవుతాడు. పెద్దల పర్యవేక్షణ: పిల్లలు టపాసులు కాల్చేటప్పుడు పెద్దలు తప్పనిసరిగా దగ్గరుండి పర్యవేక్షించాలి. సురక్షిత దుస్తులు & ప్రదేశం: వదులుగా ఉండే కాటన్ దుస్తులు, చెప్పులు, కళ్లద్దాలు ధరించాలి. ఇళ్ల లోపల కాకుండా విశాలమైన బహిరంగ ప్రదేశాల్లోనే టపాసులు కాల్చాలి. ప్రమాదకర ప్రాంతాలకు దూరం: ఆసుపత్రులు, పెట్రోల్ బంకులు, గ్యాస్ సిలిండర్లు, విద్యుత్ స్తంభాలు, త్వరగా మండే పదార్థాల సమీపంలో బాణాసంచా కాల్చకూడదు. చేయకూడని పనులు: టపాసులను జేబుల్లో పెట్టుకోవడం, శానిటైజర్ రాసుకున్న చేతులతో పేల్చడం నివారించాలి. కాలిన/పేలని టపాసుల వద్దకు వెంటనే వెళ్లకూడదు. ప్రత్యేక జాగ్రత్తలు: బాణాసంచా పొగ, శబ్దం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బంది పడకుండా చూసుకోవాలి. అవసరమైన చోట మాస్కులు ధరించాలి, అత్యవసరానికి నీటి సౌకర్యాన్ని సిద్ధంగా ఉంచుకోవాలి. అత్యవసర వేళ: ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే సమీప అగ్నిమాపక కేంద్రానికి 112 కి సమాచారం అందించాలి అని కోరారు. ఈ సందర్భంగా సి.ఐ,అందరికీ దీపావళి శుభాకాంక్షలుతెలిపారు

అల్లం బుచ్చమ్మ నివాలర్పించిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్





మంథని,నవంబర్07(ప్రజాజ్యోతి): మంథని మండలం గాజులపల్లి గ్రామంలో ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, రిటైర్డ్ టీచర్, రచయిత అల్లం వీరయ్య, కవి, రచయిత అల్లం రాజయ్య తల్లి అల్లం బుచ్చమ్మ మృతి చెందగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ పూల మాల వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా కొత్త శ్రీనివాస్, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎక్కేటి అనంత రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆకుల కిరణ్, మాజీ వైస్ ఎంపీపీ కొమ్మిడి స్వరూప్, తదితరులు అల్లం బుచ్చమ్మ మృతి పట్ల నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అల్లం రాజయ్య, అల్లం వీరయ్య, అల్లం నారాయణలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

– జర్నలిస్ట్ రాంకుమార్ కుటుంబ సభ్యులకు పరామర్శ

మంథని పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పెండ్యాల రాంకుమార్ కుటుంబ సభ్యులను సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ పరామర్శించి ఓదార్చారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

యూఏఈలో ఉద్యోగ అవకాశాలు.. టామ్‌కామ్ ద్వారా దరఖాస్తుల ఆహ్వానం

- నెలకు రూ.27 వేల నుంచి రూ.35 వేల వరకు వేతనం.. ఉచిత వసతి, భోజనం, విమాన టికెట్



పెద్దపల్లి ప్రతినిధి నవంబర్ 7 ప్రజాజ్యోతి: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నిర్మాణ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ద్వారా అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఉద్యోగ ఖాళీలు, వేతనాలు, అర్హతల వివరాలను వెల్లడించారు. నిర్మాణ రంగంలో జనరల్ హెల్పర్స్, షట్టరింగ్ కార్పెంటర్స్, స్టీల్ ఫిక్సర్స్, మేసన్స్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జనరల్ హెల్పర్స్‌కు నెలకు 1,050 యూఏఈ దిర్హామ్‌లు (సుమారు రూ.27,080), మిగతా మూడు విభాగాల ఉద్యోగాలకు నెలకు 1,350 దిర్హామ్‌లు (సుమారు రూ.34,830) వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. జనరల్ హెల్పర్స్ పోస్టులకు నైపుణ్య పరీక్ష ఉండదని, ఇతర పోస్టులకు వర్తించే నిబంధనల ప్రకారం అదనపు బోనస్ కూడా అందిస్తారని వివరించారు. 22 నుంచి 42 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన పురుషులు ఈ ఉద్యోగాలకు అర్హులని, ఎంపికైన వారికి రెండేళ్ల ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు కంపెనీ ద్వారా ఉచిత విమాన టికెట్, వసతి, రోజుకు మూడు పూటలా భోజనం, రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు 08035524946 హెల్ప్‌లైన్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 040–23342040కార్యాలయ ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని లేదా www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు.

గతంలో డబుల్ బెడ్ రూమ్ లకు ఎంపిక చేసిన లబ్ధిదారులకు అన్యాయం చేయవద్దంటూ తహసిల్దార్ కు టిఆర్ఎస్ వినతి



కాల్వశ్రీరాంపూర్ నవంబర్ 7 (ప్రజాజ్యోతి) కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని పాండవుల గుట్ట సమీపంలో ఇండ్లు లేని నిరుపేదలకు 240 డబుల్ బెడ్ రూమ్ లను గత టిఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించింది. నూట అరవై మందిని లబ్ధిదారుల ఎంపికను చేపట్టింది. ప్రస్తుతం గతంలో ఎంపిక చేసిన. లబ్ధిదారుల జాబితా తొలగించకుండా .మిగతా వాటిని లబ్ధిదారులను ఎంపిక చేయాలని టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తహసిల్దార్ డాక్టర్ రాపల్లి రాముడు కు శనివారం రోజున వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వంగల తిరుపతిరెడ్డి. మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ కుమార్. మాజీ వైస్ ఎంపీపీ జూకంటి శిరీష లతోపాటు వివిధ గ్రామాల సర్పంచులు. మాజీ సర్పంచులు. టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశం దృష్టికి సర్పంచు లు సమస్యల గోడు

- పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- డిపిఓ మండల ప్రత్యేక అధికారి శ్రీ మాల వెల్లడి



కాల్వ శ్రీరాంపూర్ నవంబర్ 7 (ప్రజా జ్యోతి) కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవో సురేందర్ కుమార్ అధ్వర్యంలో శనివారం రోజున సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల సర్పంచులు వారి సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జాఫర్ఖాన్పేట్. గంగారం. పెద్దంపేట్. గ్రామాల్లో గల పాఠశాలలో వంటగదులు శిథిలావస్థలో చేరాయని దీనితో వంట వండడం ఇబ్బందిగా మారిందని నూతన గదులు మంజూరు చేయాలని సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. శ్రీరాంపూర్ సర్పంచ్ బంగారి రమేష్ కృషితో పారిశుద్యం లేకుండా గ్రామమంత శుభ్రంగా ఉందని డాక్టర్ మహేందర్ సమావేశంలో ఆయనను అభినందించారు. సమావేశాలకు ఎక్సైజ్ శాఖ. ఆర్టిసిశాఖ.రావడంలేదనిదీనితోసమస్యలు సమస్యలుగానే మిగిలిపోతున్నాయని. రాణి శాఖలపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని మోట్లపల్లి సర్పంచ్ తుల మనోహరావు సమావేశందృష్టికితీసుకెళ్లారు.స్పందించిన శ్రీ మాల అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. మడిపల్లి గ్రామ లో ఇల్లుని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చారని సర్పంచ్ నాగరాజు అన్నారు. దీంతో తహసిల్దార్ డాక్టర్ రాపల్లి రాముడు స్పందించి ప్రభుత్వ భూమిలో అనుమతి లేకుండా కట్టడాలు నిర్మిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని అన్నారు. మొట్టపల్లి గ్రామంలో ఏఎన్ఎం లేక ప్రజలు కనీసవైద్యానికిదూరంఅవుతున్నారని ఏఎన్ఎం ను నియమించాలని ఆయన కోరారు .మండల విద్యాధికారి సిరిమల్లె మహేష్ మాట్లాడుతూ రెండు రోజుల నుండి పాలు పుల్లగా ఉన్నాయని మంచి పాలను అందించాలని ఆయన సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిపిఓ ప్రత్యేక అధికారి శ్రీ మాల మాట్లాడుతూ పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తా అన్నారు .ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు. వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

అల్లం సోదరులకు మాతృవియోగం



మంథని, నవంబర్ 07 (ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ప్రముఖ కవులు, రచయితలు, అల్లం రాజయ్య, అల్లం వీరయ్యల తల్లి అల్లం బుచ్చమ్మ (95) వృద్ధాప్యం, అనారోగ్యంతో మంథనిలో మృతి చెందారు. శనివారం ఆమె అంతక్రియలను వారి స్వగ్రామమైన మంథని మండలంలోని గాజులపల్లి గ్రామంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో నిర్వహించారు.

ప్రతి నీటి బొట్టు ను ఒడిసిపట్టాలి



మంథని, నవంబర్ 07 (ప్రజాజ్యోతి): రానున్న రోజుల్లో ఎలినినో ప్రభావం అధికంగా ఉంటుంది కాబట్టి ప్రతి నీటి బొట్టు ను ఒడిసిపట్టాలని సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ గ్రామ ప్రజలను కోరారు. మంథని మండలం కన్నాల గ్రామంలో వివిజి రామ్ జి పథకంలో భాగంగా ఫాం ఫాండ్ ను గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ ప్రారంభించారు. జలసిరిలో భాగంగా గ్రామానికి చెందిన రైతు నీరటి గట్టయ్య తవ్వించుకునేందుకు ముందుకు వచ్చాడు. ఈ సందర్భంగా మంథని ఎంపీడీవో శ్రీజా రెడ్డి ఫాం పాండ్ తవ్వించుకున్నందుకు ముందుకు వచ్చిన గ్రామ రైతులు అభినందించారు.ప్రతి ఒక్కరూ ఫాం ఫాండ్ ఇంకుడు గుంతలు కట్టించుకోవాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సదానందం, టెక్నికల్ అసిస్టెంట్ ఓంకార్, గ్రామ కార్యదర్శి కెశెట్టి మధుకర్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అల్పాహార పథకాన్ని ప్రారంభించిన సర్పంచ్ సాల్లు అజయ్ వర్మ



తిమ్మాపూర్, నవంబర్ 7(ప్రజాజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అల్పాహార పథకాన్ని శనివారం సర్పంచ్ అజయ్ వర్మ ప్రారంభించారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ న్యాలపట్ల పట్ల రాజు, పాలకవర్గ సభ్యులు పరశురామ్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పిట్టల రాజేష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేష్ ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ గడకు పూజలు నిర్వహించిన వంగ గిరిధర్ రెడ్డి

- ఎల్లమ్మ గడకు మొక్కులు చెల్లింపు



ఎల్లారెడ్డిపేట, నవంబర్ 7 (ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఈ నెల 14వ తేదీ నుంచి ఎల్లారెడ్డిపేట మండలంలో నిర్వహించనున్న శ్రీ ఎల్లమ్మ తల్లి సిద్ధోగం వేడుకల్లో భాగంగా అమ్మవారి ఎల్లమ్మ గడ భక్తుల ఇళ్లకు చేరుతోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి ఇంటికి ఎల్లమ్మ గడ చేరుకోగా, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఈ సందర్భంగా భక్తులు ప్రార్థించారు.

మనమంతా ఒక్కటే.. గ్రామ ఐక్యతే మన బలం

- రెడ్డిపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన, పోచమ్మ గుడి కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి – ఎస్సై ఆవుల తిరుపతి



వీణవంక, నవంబర్ 7 (ప్రజాజ్యోతి): గ్రామ ఐక్యత, సోదరభావంతోనే పల్లెల అభివృద్ధి సాధ్యమని వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి అన్నారు. రెడ్డిపల్లి గ్రామంలో భూలక్ష్మి–మహాలక్ష్మి బోడ్రాయి ప్రతిష్ఠాపనతో పాటు పోచమ్మ గుడి కార్యక్రమాలను గ్రామ ప్రజలందరూ కలిసికట్టుగా, ప్రశాంత వాతావరణంలో సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరూ పరస్పర సహకారం, సోదరభావంతో వేడుకల్లో పాల్గొనాలని సూచించారు. ఎలాంటి విభేదాలు, అపోహలకు తావివ్వకుండా గ్రామ ఐక్యతను కాపాడుకోవాలని తెలిపారు. వేడుకల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులకు సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.మనమంతా ఒక్కటే.. గ్రామ ఐక్యతే మన బలం అనే భావనతో ముందుకు సాగాలని,సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్సై ఆవుల తిరుపతి పిలుపునిచ్చారు.

పారమిత విద్యాసంస్థలలో ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు



కరీంనగర్ టౌన్ నవంబర్ 7 (ప్రజాజ్యోతి) స్థానిక కరీంనగర్ లోని పారమిత విద్యాసంస్థలలో ముందస్తు దీపావళి వేడుకలు నయనానందకరంగా నిర్వహించారు. ఇట్టి వేడుకల్లో విద్యార్థిని విద్యార్థులు దీపావళి పండుగ యొక్క ప్రాముఖ్యతను పాటల రూపంలో, నాటక రూపంలో మరియు నృత్య రూపంలో కళ్ళకు కట్టిన విధంగా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు, ప్రధానోపాద్యాయులు మాట్లాడుతూ చెడు పైన మంచి సాధించిన విజయానికి ప్రతీకగ దీపావళి పండుగను ఆనందంగా నిర్వహించుకుంటామని, ఈ సంతోషకర సమయంలో తల్లి దండ్రులు చెప్పిన సూచనలకు తగ్గట్టుగా దీపాలు వెలిగించే సమయంలో మరియు టపాసులు పేల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాలల చైర్మన్ ఇనుగంటి ప్రసాదరావు తల్లిదండ్రులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మరియు కరీంనగర్ పట్టణ ప్రజలందరికీ ముందస్తు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వి.యు.ఎం. ప్రసాద్, వినోద్ రావు,హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, ప్రశాంత్, బాలాజీ , శ్రీకర్, కవిత ప్రసాద్ సమన్వయ కర్తలు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దీపావళి వేడుకల్లో సీఎం రేవంత్ జన్మదిన సంబరాలు జరపాలి

- ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లల్లోనూ వెలుగులు నింపాలి
- కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పిలుపు



తిమ్మాపూర్,నవంబర్ 7 (ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మ దినంతో పాటు దీపావళి పర్వదిన వేడుకలను ఆదివారం ఆనందోత్సా హాల మధ్య ఘనంగా నిర్వహించా లని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీ సీసీ ఎన్నీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వం పల్లి సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ మేరకు శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తూ, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడంలో కీలక పాత్ర పోషించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుక లను దీపావళి పండుగ సందర్భంగా ప్రతి మండల కేంద్రంలో పార్టీ నాయ కులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. మానకొండూరు నియోజకవర్గ పరిధిలోని మానకొం డూరు, శంకరపట్నం, తిమ్మాపూర్, గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేడుకల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపా లని కోరారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, పీఏసీఎస్ పాలకవర్గాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు,కార్య కర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనేలా సమన్వయం చేసుకోవాలని డాక్టర్ కవ్వంపల్లి సూచించారు.

బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ చేసిన ఉపసర్పంచ్ పర్శరాములు గౌడ్



తిమ్మాపూర్, నవంబర్ 7 (ప్రజాజ్యోతి): కరీంనగర్ జిల్ల తిమ్మాపూర్ మండలం మల్లాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందినటువంటి పంతంగి వీరవ్వ, తుమ్మల వీరయ్య మృతి చెందగా మల్లాపూర్ గ్రామ ఉపసర్పంచ్ రాగుల పర్శరాములు గౌడ్ బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుం బానికి 25 కేజీల బియ్యం బస్తాలు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్ర మంలో వార్డ్ మెంబెర్స్ కర్ణబత్తుల మనోహర్,తాళ్లపల్లి నందకిషోర్,సాన గొండ రాములు తదితరులు పాల్గొన్నారు.


ధర్మారం బస్టాండ్‌లో బైక్ చోరీ.. కేసు నమోదు



ధర్మారం (ప్రజాజ్యోతి న్యూస్): ధర్మారం బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటనపై ధర్మారం పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2026 అక్టోబర్ 31వ తేదీన మేడారం గ్రామానికి చెందిన పడిదం రాజయ్య తన స్ప్లెండర్ బైక్ (నంబర్ AP 15 BD 9849)ను ధర్మారం బస్టాండ్‌లో పార్కింగ్ చేసి వెళ్లాడు. అనంతరం తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికాడు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు.బాధి తుడి ఫిర్యాదు మేరకు ధర్మారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టినట్లు ఎస్ఐ ఎం.శ్రీకాంత్ తెలిపారు.

చల్మెడలో ఆకట్టుకున్న 'ఆవిర్భావ 26' వేడుకలు





- విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలతో మార్మోగిన కళాశాల ప్రాంగణం
- ఆకట్టుకున్న ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు

కరీంనగర్ రూరల్ , నవంబర్ 07, (ప్రజాజ్యోతి): కరీంనగర్ బొమ్మ కల్ లోని చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ (మెడికల్ కళాశాల)లో శనివారం కళాశాల వార్షికోత్సవ వేడు కలను 'ఆవిర్భావ 26' పేరిట అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సంద ర్భంగా కళాశాల ప్రాంగణం విద్యా ర్థుల సందడి,ఆటపాటలు,ఉత్సాహభ రితమైన సాంస్కృతిక ప్రదర్శనలతో పండుగ వాతావరణాన్ని సంతరించు కుంది.విద్యార్థులు,అధ్యాపకులు,కళా శాల సిబ్బంది సమక్షంలో జరిగిన ఈ వేడుకలు ఆద్యంతం ఉల్లాసభరితంగా సాగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా అపోలో హోమ్ హెల్త్ కేర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ ఆఫీసర్ డాక్టర్ మహేష్‌జోషి, కళాశాల చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, డా.సూర్యనారా యణ రెడ్డి హాజరయ్యారు.తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవ వేడు కలను అధికారికంగా ప్రారంభిం చారు.ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ..విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థుల్లోని సృజనాత్మకత,ప్రతిభ,నాయకత్వ లక్ష ణాలు, సామాజిక బాధ్యతలను వెలికి తీసేలా ఉండాలని పేర్కొన్నారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు చదు వుతో పాటు ఇతర రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుకోవాలని సూచిం చారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైన దని, భవిష్యత్తులో వైద్యులుగా సమా జానికి సేవలందించే క్రమంలో మాన వతా విలువలు, సేవాభావం, క్రమశిక్ష ణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలి పారు.కళాశాల వార్షికోత్సవాలు విద్యా ర్థుల్లో దాగి ఉన్న వివిధ కళా నైపుణ్యా లను వెలికితీసేందుకు, వారిలో ఆత్మవి శ్వాసాన్ని పెంపొందించేందుకు చక్కటి వేదికగా నిలుస్తాయని పేర్కొ న్నారు. విద్యార్థులు చదువులో రాణిం చడంతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లోనూ ముందుండాలని ఆకాం క్షించారు.అనంతరం విద్యార్థులు నిర్వ హించిన వివిధ సాంస్కృతిక కార్యక్ర మాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ నృత్యాలు,పాశ్చాత్య నృత్యాలు, పాటలు, సంగీత ప్రదర్శ నలు, వివిధ కళారూపాలతో విద్యా ర్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఒక్కొక్క ప్రదర్శనకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. విద్యార్థుల నృత్యాలు,కళా ప్రదర్శనలు,సమ న్వయం,ఉత్సాహం అక్కడికి వచ్చిన వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. తోటి విద్యార్థులు చప్పట్లతో ప్రోత్స హిస్తూ కార్యక్రమాలను మరింత ఉత్సా హంగా కొనసాగించారు.వార్షికోత్సవ వేడుకల సందర్భంగా కళాశాల ప్రాంగణమంతా విద్యార్థుల కేరిం తలు,సందడితో నిండిపోయింది.చదు వుల ఒత్తిడికి కొంత విరామం కల్పిస్తూ,విద్యార్థుల మధ్య స్నేహభా వాన్ని,ఐక్యతను పెంపొందించేలా ఈ వేడుకలు నిలిచాయి.వివిధ విభాగా లకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయ వంతం చేశారు.ఈ కార్యక్రమంలో డా. ఆసిమ్ అలీ,డా. అనిత,డా.రామ కృష్ణ ప్రసాద్, వైద్యులు, అధ్యాపకులు, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు తదిత రులు పాల్గొన్నారు.

పత్తి తూకంలో వ్యాపారుల మోసం

- నిలదీసిన రైతులు



ఇల్లంతకుంట నవంబర్ 7(ప్రజా జ్యోతి) పత్తి కొనుగోళ్లలో రైతులను మోసం చేస్తున్నఘటన రాజన్నసిరిసిల్ల జిల్లాలోనిఇల్లంతకుంట మండలం కందికట్కూర్ గ్రామంలో శనివారం రోజు వెలుగుచూసింది. మార్కెట్ ధర కంటే క్వింటాల్‌కు రూ.400 ఎక్కువ చెల్లిస్తామంటూ రైతులను ఆకర్షించి, డిజిటల్ వెయింగ్ మిషన్ ద్వారా తూకంలో భారీగా మోసానికి పాల్పడుతున్న వ్యక్తిని గ్రామ రైతులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. రైతుల కదనం ప్రకారం . పత్తి కొనుగోలు చేసే సమయంలో మార్కెట్ ధర కంటే క్వింటాల్‌కు రూ.400 అద నంగా ఇస్తామంటూ కొందరు వ్యాపారులు రైతులను ఆకర్షిస్తున్నారు. ఒక్క బస్తాకు 40 కిలోల నుంచి 50 కిలోల వరకు తూకంలో మోసం చేస్తూ అడ్డంగా దోరికిపోయారు. గ్రామానికి చెందిన కంకణాల పర్శరాం అనే రైతు మూడు బస్తాల పత్తి తూకం వేయించాడు. మొదట ఒక్కోబస్తా క్వింటాల్ వచ్చింది, తిరిగి రైతుకు అనుమానం వచ్చి మళ్లి తూకం వేయించడంతో ఒక్కోబస్తా క్వింటాల్ 50కిలోలు వచ్చింది. దీంతో ఒక్కో బస్తాలో 50కేజీల మోసం తెలడంతో పోలీసులకు సమా చారం అందించారు. మోసనికి పాల్పడ్డ ముగ్గురు వ్యక్తులు రైతు కుటుంబ సభ్యు లను, గ్రామస్థులను ప్రాదేయపడడంతో వదిలిపెట్టారు.ఇప్పటికయినా అధికా రుల పర్యవేక్షణ చేయాలి. రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసే వ్యాపారుల తూకా లపై సంబంధిత అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, పర్యవేక్షణ లోపం కారణంగానే ఇలాంటి మోసాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని తూకంలో మోసా లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహి స్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మార్గదర్శి విద్యానికేతన్‌లో ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు





కొనరావుపేట, నవంబర్. 07(ప్రజాజ్యోతి) కొనరావుపేట మండలం కొల నూరు గ్రామంలోని మార్గదర్శి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణమంతా దీపాలు, కొవ్వొత్తులతో అలంకరించి పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మండల చిరంజీవి విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టత, ప్రాముఖ్యత, పండుగ వెనుక ఉన్న సాంస్కృతిక సంప్రదాయాల గురించి వివరించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని, ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపే పండుగగా దీపావళిని జరుపుకుంటామని తెలిపారు. పండుగలను ఆనందో త్సాహాలతో పాటు సంప్రదాయాలు, విలువలను గౌరవిస్తూ జరుపుకోవాలని విద్యార్థులకు సూచించారు. దీపాల వెలుగులతో పాఠశాల ప్రాంగణం అంగ రంగ వైభవంగా ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొని వేడుక లను విజయవంతం చేశారు.

కోనరావుపేటలో నవంబర్ 9న ఎంఎస్ ఎఫ్ నూతన మండల కమిటీ ఎన్నిక

- విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలి:
- ఎలగందుల బిక్షపతి మాదిగ



కోనరావుపేట, నవంబర్. 07 (ప్రజా జ్యోతి) కొనరావుపేట మండలంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నూతన మండల కమిటీని ఈ నెల 9వ తేదీ సోమవారం ఎన్నుకోనున్నట్లు ఎమ్మార్పీఎస్, ఎంఎస్ పీ నాయకులు వెల్లడించారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు విద్యార్థి సంఘాలను బలోపేతం చేయడంతో పాటు,విద్యార్థులసమస్యలపరిష్కారం మరియు విద్యా అభివృద్ధి లక్ష్యంగా నూతన కమిటీల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నవంబర్ 7వ తేదీ శనివారం కోనరావుపేట మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ పీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ గ్రామస్థాయి, మండలస్థాయి కమిటీల నిర్మాణంతో పాటు ప్రభుత్వ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, పీజీ కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో ఎంఎస్ ఎఫ్ నూతన కమిటీలను ఏర్పాటు చేయడంపై ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి మాదిగ మాట్లాడుతూ.. సమాజంలో విద్య ద్వారానే మాదిగ విద్యార్థుల భవిష్యత్తు జీవితాల్లో మార్పు సాధ్యమవుతుందని అన్నారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రామాల్లో ఎంఎస్ ఎఫ్ నూతన కమిటీలను ఏర్పాటు చేసి,సంఘాన్నిమరింతబలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీ సోమవారం కోనరావుపేట మండలంలో ఎంఎస్ ఎఫ్ నూతన మండల కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ కమిటీ నిర్మాణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్ చార్జి పుట్ట రవి మాదిగ హాజరుకానున్నట్లు వెల్లడించారు. గ్రామాల నుంచి విద్యార్థులు, ఎంఎస్ ఎఫ్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని నూతన మండల కమిటీ ఎన్నిక కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఎలగందుల బిక్ష పతి మాదిగ పిలుపునిచ్చారు. ఈ సమావేశాన్ని కోనరావుపేట మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అక్కనపెల్లి సురేష్ మాదిగ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు బెజగం ముత్యం రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లె బాబు మాదిగ, ఎంఎస్ ఎఫ్ మండల అధ్యక్షుడు తైదల రాజయ్య మాదిగ, ఎంఎస్ పీ మండల ఉపాధ్యక్షుడు బొల్లె దేవయ్య మాదిగ, లింగంపల్లి ప్రసాద్ మాదిగ, తటకర్ల ఎల్లం మాదిగ, బొల్లె ప్రసాద్ మాదిగ, బొల్లె భూమయ్య మాదిగ, తైదల శంకర్ మాదిగ పాల్గొన్నారు.

పాఠశాలలో వెలిగిన ఆధ్యాత్మిక కాంతులు.. దీపావళి వేడుకలు ఘనం!



గంగాధర 07/నవంబర్/2026: (ప్రజా జ్యోతి): గంగాధర మండలం మధురానగర్‌లోని సురభి కాన్వెంట్ హైస్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. పాఠశాల ప్రాంగణంలో శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో విద్యాసంస్థలో ఆధ్యాత్మిక కాంతులు వెల్లివిరిశాయి. విద్యార్థులంతా రంగురంగుల సాంప్రదాయ దుస్తులు ధరించి హాజరుకావడంతో పాఠశాల ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది. శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి పూజా కార్యక్రమాల అనంతరం చిన్నారులు టపాసులు కాలుస్తూ, కేరింతలు కొడుతూ ముందస్తు దీపావళిని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అజ్ఞానమనే చీకటిపై జ్ఞానమనే వెలుగు సాధించిన విజయానికి దీపావళి ప్రతీక అని, పండుగలు ఐకమత్యానికి వేదికలని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని శబ్ద, వాయు కాలుష్యాలు తగ్గించేలా జాగ్రత్తలు పాటిస్తూ టపాసులు కాల్చాలని ఉపాధ్యాయ బృందం హితవు పలికింది. ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ చిప్ప వీరేశం, డైరెక్టర్ చిప్ప వీర నర్సయ్య, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.

ఘనంగా గోదావరి అర్బన్ బ్యాంకులో దీపావళి వేడుకలు

- ధనలక్ష్మి పూజలు.. ఖాతాదారులకు మిఠాయిల పంపిణీ



సుల్తానాబాద్, నవంబర్ 7 (ప్రజాజ్యోతి): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్‌లోని గోదావరి అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ప్రాంగణంలో ధనలక్ష్మి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత ఛత్రపతి శివాజీ మహారాజ్ ప్రతిమ ఎదుట జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన ధనలక్ష్మి పూజలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ అంతటి చిరంజీవి మాట్లాడుతూ దీపావళి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. బ్యాంకు ఖాతాదారులు,పట్టణప్రజలు ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మహాలక్ష్మిని ప్రార్థించినట్లు తెలిపారు. ఖాతాదారులకు నాణ్యమైన, మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు గోదావరి అర్బన్ బ్యాంక్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం బ్యాంకు సిబ్బంది ఖాతాదారులకు మిఠాయిలు పంపిణీ చేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. బాణసంచా కాల్చి, కాకరపువ్వొత్తులు వెలిగించడంతో బ్యాంకు ప్రాంగణం సందడిగా మారింది. బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, స్థానిక ప్రముఖులు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ జడ్పీటీసీ ఐల రమేష్, చిన్నకాల్వల సర్పంచ్ ప్రపంతి రమేష్, మాజీ ఎంపీటీసీ మోలుగురి అంజయ్యగౌడ్, బ్యాంకు సిబ్బంది ఎరుకొండ తిరుపతి, గుండా రమేష్, కుమార్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో బ్యాంకు ఖాతాదారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

కళ్లెం మల్లవ్వ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్



ధర్మారం, (ప్రజా జ్యోతి): ధర్మారం మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన కళ్లెం మల్లవ్వ మృతి చెందడంతో జగిత్యాల జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్ ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. మల్లవ్వమృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో గోపాలరావుపేట సర్పంచ్ సంకసాని సౌజన్య సతీష్ రెడ్డి,మాజీ సర్పంచ్ కనుగొట్ల శ్రీనివాస్ రెడ్డి, జనగామ అంజయ్య, ఉపసర్పంచ్ భారత స్వామి,మాజీ ఉపసర్పంచ్ మేకల రాజయ్య, సంకసాని శేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు రేండ్ల అనిత, రాయలింగు తదితర టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గింజలు లేని చింతపండు సరఫరాకు కొటేషన్ల ఆహ్వానం


- జగిత్యాల జిల్లాలోని 10 గురుకుల విద్యాలయాలకు సరఫరా


జగిత్యాల, నవంబర్ 7, ప్రజాజ్యోతి జగిత్యాల జిల్లాలోని మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలో ఉన్న 10గురుకుల విద్యాలయాలకు 2026–27 విద్యా సంవత్సరానికి అవసరమైన గింజలు లేని చింతపండు సరఫరా చేసేందుకు ఆసక్తి గల సరఫరాదారుల నుంచి కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.ఆసక్తి గల సరఫరాదారులు చింతపండు నాణ్యత, కిలో ధర, సరఫరా చేయగల పరిమాణాన్ని స్పష్టంగా పేర్కొంటూ నవంబర్ 9వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నవంబర్ 11వ తేదీ సాయంత్రం 4గంటల వరకు కొటేషన్లు సమర్పించాలి. కొటేషన్‌లో పేర్కొన్న ధరలోనే రవాణా ఖర్చులు కలిపి ఉండాలి. జిల్లాలోని మొత్తం 10గురుకుల విద్యాలయాలకు నేరుగా సరఫరా చేయడంతో పాటు, ప్రతి విద్యాలయానికి అవసరాన్ని బట్టి నెలకు ఒకసారి చింతపండు అందించాల్సి ఉంటుంది.కొటేషన్లను పెగడపల్లి మండలం గొల్లపల్లిలోని మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల (బాలికలు) ప్రాంగణంలోని జిల్లా కన్వీనర్ కార్యాలయంలో సమర్పించాలి.స్వీకరించిన కొటేషన్లను నవంబర్ 13వ తేదీ సాయంత్రం 4గంటలకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సమక్షంలో తెరిచి, జిల్లా కొనుగోలు కమిటీ పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. కొటేషన్లను ఆమోదించడం, తిరస్కరించడం లేదా ప్రక్రియను రద్దు చేసే అధికారం కమిటీకి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9154102664 నంబరును లేదా mjpdmp456@gmail.com ఈ-మెయిల్‌ను సంప్రదించాలని సూచించారు.

ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్ బి. సత్యప్రసాద్

- భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరుపై సమీక్ష

జగిత్యాల, నవంబర్ 07, ప్రజాజ్యోతి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ధరూర్ క్యాంప్‌లోని ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు) గోదామును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సత్యప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎంల భద్రత, రక్షణ ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, ఇతర సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భద్రతా వ్యవస్థ నిరంతరం పనిచేసేలా చూడాలని, సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, ఎలక్షన్ సూపరింటెండెంట్ జ్యోతి, జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.





దీపావళి సెలవు తేదీని మార్చి పలు పండుగలకు సాధారణ, ఐచ్చిక సెలవులు ప్రకటించాలి

- ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కి ఆర్యుపిపిటిఎస్ జిల్లా శాఖ పక్షాన వినతి

రాయికల్, నవంబర్ 07 (ప్రజా జ్యోతి) ఉపాధ్యాయులు, ఉద్యోగుల ఆచార వ్యవహారాలు, పండుగల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వ సెలవుల క్యాలెండర్ లో తగిన మార్పులు చేయాలని రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, జిల్లా శాఖ ప్రధానకార్యదర్శి ఎనగందుల రాజేంద్రప్రసాద్, జిల్లా గౌరవాధ్యక్షులు అలకట్టు సత్యనారాయణ లు కోరుతూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి వినతిపత్రం పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీపావళి పండుగ సెలవును ప్రస్తుతం ప్రకటించిన 8వ తేదీకి బదులుగా 9వ తేదీకి మార్చాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా హిందూ సంప్రదాయంలో విశిష్ట ప్రాధాన్యత కలిగిన రక్షాబంధన్, వరలక్ష్మీ వ్రతం పండుగలను వచ్చే సంవత్సరం నుంచి సాధారణ సెలవుల జాబితాలో చేర్చాలని కోరారు. అలాగే రథసప్తమి, తొలి ఏకాదశి పండుగల ఆధ్యాత్మిక, ధార్మిక ప్రాధాన్యతను గుర్తించి వాటిని ఐచ్చిక సెలవులుగా ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కావున ఉపాధ్యాయులు, ఉద్యోగుల విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి వచ్చే సంవత్సరం ప్రభుత్వ సెలవుల క్యాలెండర్ లో ఈ మార్పులను అమలు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

నిజామాబాద్ లో యువకుడు ఆత్మహత్య

► కేసు నమోదు చేసిన పోలీసులు



కోనరావుపేట, నవంబర్. 07 (ప్రజాజ్యోతి) కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో పాటు మానసిక ఇబ్బందులతో బాధపడుతున్న మహమ్మద్ చాంద్ పాషా (39) మృతి చెందాడు. ఈ ఘటనపై కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ గ్రామానికి చెందిన మహమ్మద్ చాంద్ పాషా, తండ్రి కాసిం, గత కొంతకాలంగా అనారోగ్యంతో పాటు మానసిక సమస్యలతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు వైద్య చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినప్పటికీ, ఆయన సహకరించేవాడు కాదని చాంద్ పాషాకు ఇంకా వివాహం కాలేదని , ఈ క్రమంలో నవంబర్ 7వ తేదీ మధ్యాహ్నం ఆయన తల్లి మహమ్మద్ సుల్తానా 12 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఒంటి గంటకు వచ్చిన సమయంలో చాంద్ పాషా మృతి చెందినట్లు గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారు. తన కుమారుడి మృతిపై తనకు గానీ, కుటుంబ సభ్యులకు గానీ ఎవరి మీద ఎలాంటి అనుమానం లేదని, ఆయన అనారోగ్యం, మానసిక సమస్యల కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుని ఉండవచ్చని తల్లి మహమ్మద్ సుల్తానా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై బి రామ్మోహన్ గౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చీరలవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు



వేములవాడ,నవంబర్,7: ప్రజాజ్యోతి. చీరలవంచ గ్రామంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు ముందస్తు దీపావళి వేడుకలను ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాలప్రధానోపాధ్యాయురాలు బి. అరుణ మాట్లాడుతూ.. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించడంతో పాటు భారతదేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఎంతో వైభవంగా జరుపుకునే దీపావళి పండుగను పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని, కాలుష్యానికి తావులేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు పండుగ విశిష్టతను తెలియజేస్తూ పర్యావరణహిత దీపావళి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఆనందోత్సాహాల మధ్య ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి. అరుణ, ఉపాధ్యాయులు ఎన్. శివ, ఎం. పద్మ, పి. రాజు, విశ్వనాథచారి, జి. వనజతో పాటు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్సే నా మతం.. జీవితాంతం దానినే ఆరాధిస్తాను!

- విజ్ఞాన ప్రపంచంలో భారతదేశ కీర్తి పతాకను ఎగురవేసిన మహా శాస్త్రవేత్త సర్ సీవీ రామన్
- నోబెల్బహుమతిఅందుకున్న తొలి ఆసియా శాస్త్రవేత్తగా అరుదైన ఘనత





వేములవాడ, నవంబర్, 7: ప్రజాజ్యోతి. భారతదేశ ఖ్యాతిని ప్రపంచ విజ్ఞాన రంగంలో చాటిచెప్పిన మహోన్నత భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత సర్ చంద్రశేఖర వెంకట రామన్ (సీవీ రామన్) 138వ జయంతిని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. "సైన్సే నా మతం.. జీవితాంతం దానినే ఆరాధిస్తాను" అనే నమ్మకంతో తన జీవితాన్ని విజ్ఞాన పరిశోధనలకు అంకితం చేసిన మహోన్నత వ్యక్తి సర్ సీవీ రామన్ అని కొనియాడారు. ఆయన చేసిన అద్భుతమైన పరిశోధనలు భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపును తీసుకువచ్చాయని పేర్కొన్నారు. సర్ సీవీ రామన్ 1888 నవంబర్ 7న తమిళనాడులోని తిరుచిరాపల్లి సమీపంలో జన్మించారని, చిన్ననాటి నుంచే చదువులో అసాధారణ ప్రతిభ కనబరిచారని వివరించారు. కేవలం 12వ ఏటనే మెట్రిక్యులేషన్ పూర్తి చేసి, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించి భౌతిక శాస్త్రంలో విశేష ప్రతిభ కనబరిచారని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగంలో చేరినప్పటికీ, విజ్ఞాన శాస్త్రంపై ఉన్న అపారమైన ఆసక్తితో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పరిశోధనలు కొనసాగించారని చెప్పారు. సైన్స్ పట్ల ఉన్న మక్కువతో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి కలకత్తా విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్ర ఆచార్యుడిగా బాధ్యతలు చేపట్టారని వివరించారు. సముద్రపు నీరు నీలి రంగులో ఎందుకు కనిపిస్తుంది? అనే ఆసక్తికరమైన ప్రశ్న ఆయనలో కాంతి పరిక్షేపణంపై పరిశోధన చేయాలనే జిజ్ఞాసను కలిగించిందన్నారు. ఈ పరిశోధనల ఫలితంగానే 1928 ఫిబ్రవరి 28న కాంతి ఒక పారదర్శక పదార్థం గుండా ప్రయాణించినప్పుడు దాని తరంగదైర్ఘ్యంలో మార్పు సంభవిస్తుందని కనుగొన్నారని, ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆవిష్కరణనే 'రామన్ ఎఫెక్ట్' అని పిలుస్తారని వివరించారు. అత్యంత సాధారణమైన, తక్కువ ఖర్చుతో కూడిన పరికరాలను ఉపయోగించి ఇంతటి గొప్ప ఆవిష్కరణ చేయడం ఆయన పరిశోధనా ప్రతిభకు నిదర్శనమని అన్నారు. ఈ ఆవిష్కరణ భౌతిక శాస్త్ర పరిశోధనల్లో కొత్త మార్గాలకు నాంది పలికిందని పేర్కొన్నారు. రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరణకు గుర్తింపుగా 1930లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి అందుకున్న ఆయన, సైన్స్ విభాగంలో నోబెల్ పురస్కారం పొందిన తొలి ఆసియా వ్యక్తిగా చరిత్ర సృష్టించారని తెలిపారు. 1929లో బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు 'సర్' బిరుదును ప్రదానం చేసిందని, 1954లో భారత ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న'తో సత్కరించిందని గుర్తు చేశారు. ఆయన చేసిన అపారమైన సేవలకు గుర్తుగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న భారతదేశవ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా ఆసక్తి, ప్రశ్నించే తత్వం పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా పరిసర ప్రపంచాన్ని నిశితంగా పరిశీలిస్తూ, ప్రతి విషయాన్ని ప్రశ్నిస్తూ, కొత్త విషయాలను తెలుసుకోవాలనే తపనతో ముందుకు సాగాలని సూచించారు. సీవీ రామన్ జీవితం విద్యార్థులకు గొప్ప స్ఫూర్తిదాయకమని, కష్టపడి చదివితే, నిరంతరం పరిశోధన చేస్తే సామాన్య పరిస్థితుల నుంచి కూడా అసాధారణ విజయాలను సాధించవచ్చని ఆయన జీవితం నిరూపిస్తోందని పేర్కొన్నారు. 1970 నవంబర్ 21న బెంగళూరులో ఆయన తుదిశ్వాస విడిచినప్పటికీ, ఆయన చేసిన ఆవిష్కరణలు, అందించిన విజ్ఞాన సంపద ప్రపంచ శాస్త్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్గేటి లక్ష్మీనారాయణ, కంకెల్కార్ మోహన్, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజుల, పులి శారదతో పాటు పాఠశాల విద్యార్థులు పాల్గొని మహా శాస్త్రవేత్త సర్ సీవీ రామన్‌కు ఘన నివాళులర్పించారు.

ఆనందాల దీపావళి.. అప్రమత్తతతోనే సురక్షితం

- సురక్షిత దీపావళే లక్ష్యం.. ప్రజలకు 108 కీలక సూచనలు
- 108 తెలంగాణ రాష్ట్ర సీఈఓ బి. సుధాకర్ సూచన



ధర్మారం, నవంబర్ 06 (ప్రజా జ్యోతి న్యూస్): చీకట్లను పారద్రోలుతూ ప్రతి ఇంటా వెలుగులు నింపే దీపావళి పండుగను ప్రజలంతా సురక్షిత వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని జీవీకే గ్రీన్ హెల్త్ సర్వీసెస్ 108 తెలంగాణ రాష్ట్ర ముఖ్యకార్యనిర్వహణ అధికారి బి.సుధాకర్ సూచించారు. దీపావళి వేడుకల సందర్భంగా ప్రజలకు పలు కీలక భద్రతా సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగను ఉత్సాహంగా జరుపుకోవడం ఎంత ముఖ్యమో, అదే సమయంలో వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం అంతే ముఖ్యమని పేర్కొన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని, ముఖ్యంగా బాణసంచా కాల్చే సమయంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

దుస్తుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

టపాసులు కాల్చే సమయంలో సింథటిక్, నైలాన్ దుస్తులకు దూరంగా ఉండాలని, నిప్పు అంటుకునే ప్రమాదం తక్కువగా ఉండే శరీరానికి సరిపోయే కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు.

సురక్షిత ప్రదేశాల్లోనే బాణసంచా కాల్చాలి.

ఇళ్లకు, విద్యుత్ వైర్లకు, వాహనాలకు దూరంగా విశాలమైన బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే టపాసులు కాల్చాలని తెలిపారు. కాల్చిన టపాసుల వద్దకు వెంటనే వెళ్లకుండా, అవి పూర్తిగా పేలాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. పేలని టపాసులను తిరిగి వెలిగించే ప్రయత్నం చేయకూడదని హెచ్చరించారు. పిల్లలపై పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి చిన్నపిల్లలను ఒంటరిగా టపాసులు కాల్చేందుకు అనుమతించకూడదని, పెద్దలు దగ్గరుండి పర్యవేక్షించాలని సూచించారు. బాణసంచా కాల్చే ప్రదేశంలో ఒక బకెట్ నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవడం ద్వారా ప్రమాద సమయాల్లో తక్షణ జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు.

కాలిన గాయాలపై తక్షణ ప్రథమ చికిత్స:

టపాసుల కారణంగా చిన్నపాటి కాలిన గాయాలు ఏర్పడితే వెంటనే సబ్బు, ఐస్ లేదా ఇతర పదార్థాలను ఉపయోగించకుండా, గాయమైన ప్రాంతాన్ని 15 నుంచి 20 నిమిషాల పాటు చల్లటి పారే నీటి కింద ఉంచాలని సూచించారు. తీవ్రమైన కాలిన గాయాలు ఏర్పడితే ఆలస్యం చేయకుండా వైద్య సహాయం పొందాలని తెలిపారు.

పొగతో శ్వాసకోశ సమస్యలు:

అధికంగా బాణసంచా కాల్చడం వల్ల వాతావరణంలో దట్టమైన పొగ వ్యాపించి శ్వాసకోశ సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నవారు పొగకు దూరంగా ఉండాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని శబ్ద, కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించాలని కోరారు. దీపావళి వేడుకల్లో ఏదైనా ప్రమాదం లేదా అత్యవసర పరిస్థితి ఎదురైతే ఆందోళన చెందకుండా వెంటనే 108 అంబులెన్స్ సేవలను సంప్రదించాలని బి. సుధాకర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 108 అంబులెన్స్ సేవలు అత్యవసర వైద్య సహాయం అందించేందుకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలందరూ అప్రమత్తత, బాధ్యతాయుత ప్రవర్తనతో పండుగను జరుపుకోవాలని, తమ కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కల వారి భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమమని పేర్కొంటూ ప్రజలందరికీ సురక్షిత దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రమాదం పొంచి ఉన్న పట్టించుకోరా..?

- అప్రోచ్ రోడ్డుపై పొంచి ఉన్న ప్రమాదం
- రైలింగ్ ఏర్పాటు చేయాలని ప్రయాణికుల డిమాండ్





కొడిమ్యాల, నవంబర్ 7 (ప్రజాజ్యోతి) :కొడిమ్యాల మండల కేంద్రం నుంచి నాచుపల్లిగ్రామానికివెళ్లేదారిలో నూతనంగా నిర్మించిన వంతెనకు అనుసంధానంగా ఉన్న అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా రక్షణ రైలింగ్ ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల ముప్పును ఎదుర్కొనే అవకాశం ఉందని,రహదారిఅంచులవద్ద రక్షణ కంచె లేకపోవడం ప్రయాణికుల్లో ఆందోళన కలిగిస్తోంది.

›› అంచుల వద్ద అప్రమత్తత అవసరం

ఈ మార్గంలో నిత్యం బస్సులు, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అప్రోచ్ రోడ్డుకు ఇరువైపులా రైలింగ్ లేకపోవడంతో వాహనదారులు ఏమాత్రం నియంత్రణ కోల్పోయినా ప్రమాదం జరిగేఅవకాశం ఉందనిస్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో వెలుతురు తక్కువగా ఉన్నప్పుడు, వర్షాలు కురిసే సమయంలో రహదారి అంచులను గుర్తించడం కష్టమవుతుందని చెబుతున్నారు.సంబంధిత అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు

›› ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలి

వంతెన నిర్మాణంతో రాకపోకలకు సౌకర్యం కలిగినా, అప్రోచ్ రోడ్డుకు రక్షణ చర్యలు లేకపోతే ప్రయాణ భద్రత ప్రశ్నార్థకంగా మారుతుంది. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అప్రమత్తమై రహదారికి ఇరువైపులా రక్షణ రైలింగ్ ఏర్పాటు చేయాలి.

చిర్ర చింటు....నాచుపల్లి గ్రామస్తుడు



యూఏఈలో ఉద్యోగ అవకాశాలు.. టామ్‌కామ్ ద్వారా దరఖాస్తులకు ఆహ్వానం

నిర్మాణ రంగంలో జనరల్ హెల్పర్స్, కార్పెంటర్లు, స్టీల్ ఫిక్సర్లు, మేస్త్రీలకు అవకాశం

జగిత్యాల, నవంబర్ 07, ప్రజాజ్యోతి తెలంగాణ ప్రభుత్వ పరిధిలోని తెలంగాణఓవర్సీస్‌మ్యాన్‌పవర్‌కంపెనీలిమిటెడ్ (TOMCOM)ఆధ్వర్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE)లో నిర్మాణ రంగంలో ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జగిత్యాల జిల్లా ఉపాధి కల్పనాధికారి బి. సత్యమ్మ తెలిపారు. జిల్లాలోని ఆసక్తిగల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.ఈ ఉద్యోగాల్లో జనరల్ హెల్పర్స్‌కు నెలకు 1,050 యూఏఈ దిర్హమ్స్ (సుమారు రూ.27,080),షట్టరింగ్ కార్పెంటర్లు,స్టీల్ ఫిక్సర్లు,మేస్త్రీలకు నెలకు 1,350 దిర్హమ్స్ (సుమారు రూ.34,830) వేతనం అందించనున్నట్లు పేర్కొన్నారు. జనరల్ హెల్పర్స్‌కు ఎలాంటి నైపుణ్య పరీక్ష ఉండదని, మిగతా ఉద్యోగాలకు సంబంధిత నైపుణ్యాలు అవసరమని తెలిపారు. వర్తించే నిబంధనల ప్రకారం అదనపు బోనస్ కూడా అందించనున్నారు.అభ్యర్థుల వయస్సు 22 నుంచి 42 సంవత్సరాల మధ్య ఉండాలని, ఎంపికైన వారికి రెండేళ్ల ఒప్పందంపై ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులకు ఉచిత విమానటికెట్, వసతి, రోజుకు మూడు పూటల భోజనం, రవాణా సౌకర్యం కంపెనీ కల్పించనుంది.ఆసక్తిగలఅభ్యర్థులు 08035524946నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వడం ద్వారా లేదా ప్రకటనలోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23342040ను సంప్రదించాలని,అధికారిక వెబ్‌సైట్ www.tomcom.telangana.gov.in ను సందర్శించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సూచించారు.

మైనారిటీ విద్యార్థులకు నాలుగు విదేశీ భాషల్లో ఉచిత శిక్షణ

- జపనీస్, జర్మన్, ఫ్రెంచ్, కొరియన్ భాషల్లో 45 రోజుల ఫౌండేషన్ కోర్సులు.. దరఖాస్తులకు ఆహ్వానం

జగిత్యాల, నవంబర్ 7, ప్రజాజ్యోతి తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ (TGMSC&CCC), హైదరాబాద్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన విద్యార్థులు,నిరుద్యోగ యువతకు నాలుగు విదేశీ భాషల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి తెలిపారు. జపనీస్, జర్మన్, ఫ్రెంచ్, కొరియన్ భాషల్లో 45 రోజుల ఫౌండేషన్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన, పార్సీ, బౌద్ధ మతాలకు చెందిన అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి, ఉపాధి మరియు ఇతర కెరీర్ అవకాశాలను ఆశించే నిరుద్యోగ యువతకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు.దరఖాస్తులస్వీకరణ అక్టోబర్ 31 నుంచి ప్రారంభమై నవంబర్ 10తో ముగియనుంది. నవంబర్ 10అనంతరం తరగతులు ప్రారంభం కానున్నాయి.ఆసక్తిగల అభ్యర్థులు విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఇటీవల తీసుకున్న రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హైదరాబాద్‌లోని తెలంగాణ మైనారిటీస్‌స్టడీ సర్కిల్,ఇందిరా ప్రియదర్శినిడిగ్రీకళాశాలప్రాంగణం,ఎంఏ ఎం క్యాంపస్, మాసాబ్ ట్యాంక్, నాంపల్లి చిరునామాలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.మరిన్ని వివరాలకు 040-23236112, 9059050062 నంబర్లలో లేదా directormsccctelangana@gmail.com ఈమెయిల్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.పనిదినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివరాలు పొందవచ్చన్నారు. జగిత్యాల జిల్లాలోని అర్హులైన మైనారిటీ విద్యార్థులు, నిరుద్యోగ యువత ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కోరారు.

బుగ్గారం అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి



బుగ్గారం నవంబర్ 07(ప్రజాజ్యోతి): బుగ్గారం మండల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడునగునూరినర్సగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు శనివారం రాష్ట్రఎస్సీ,ఎస్టీసంక్షేమశాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బుగ్గారం ఎక్స్‌రోడ్డు నుంచి మండల కేంద్రం వరకు డబుల్ రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే విద్యార్థినులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి శాశ్వత భవనాన్ని నిర్మించాలని, భక్తుల చిరకాల కోరికైన శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ సహాయం అందించాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు.వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.సంబంధిత అధికారులతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మండల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనుల కోసం కృషి చేస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో నక్క రాజయ్య, తాడెపు లింగన్న, దసర్తి పోసన్న, కేలేటి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ అభ్యర్థులకు ఉచితంగా పోటీ పరీక్షల పుస్తకాలు, స్టడీ మెటీరియల్

- దరఖాస్తుల సమర్పణకు నవంబర్ 12 వరకు గడువు

జగిత్యాల, నవంబర్ 7, ప్రజాజ్యోతి రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వ ఉద్యోగనియామక పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పేద, అర్హులైన మైనారిటీ అభ్యర్థులకు తెలంగాణ స్టేట్ మైనారిటీస్టడీ సర్కిల్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచితంగా పుస్తకాలు,స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి తెలిపారు.మైనారిటీ సంక్షేమ శాఖ నియంత్రణలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా TGPSC గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4తో పాటు పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ మైనారిటీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.అర్హత కలిగిన అభ్యర్థులు మైనారిటీ ధ్రువీకరణ పత్రం, విద్యార్హత ధ్రువీకరణ పత్రం, పోటీ పరీక్ష దరఖాస్తు లేదా రిజిస్ట్రేషన్ ప్రతితో పాటు ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫోటో జతచేసి నవంబర్ 12, 2026లోగా దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.దరఖాస్తులను జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయం, రూమ్ నంబర్ 127, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (IDOC), జగిత్యాలలో అందజేయాలని తెలిపారు.మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన నిరుద్యోగ యువత ఈ ఉచిత పుస్తకాలు, స్టడీ మెటీరియల్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కోరారు.

ఆరుతడి పంటల సాగుతోనే నీటి పొదుపు



కొడిమ్యాల, నవంబరు 7 (ప్రజాజ్యోతి): యాసంగిలో భూగర్భ జలాల కొరత దృష్ట్యారైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి పి.జ్యోతి సూచించారు.శనివారంమండలంలోనిరామకిష్టాపూర్ గ్రామంలో నిర్వహించిన ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మొక్కజొన్న, పెసర, మినుములు, శనగలు, నువ్వుల సాగుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. వరి పంట అవశేషాలను కాల్చకుండా పశుగ్రాసంగా వినియోగించుకోవాలని లేదా నేలలో కలియదున్నాలని సూచించారు. ఉద్యానవన శాఖ హెచ్ ఈవో ఎన్.అనిల్ కూరగాయలు, ఆయిల్ పామ్ సాగు, రాయితీల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నేరెళ్ల మహేష్, ఏఈఓ తేజస్విని, పంచాయతీ కార్యదర్శి నవీన్, రైతులు పాల్గొన్నారు.

రేపే శానబండలో భూముల రీ-సర్వేకు శ్రీకారం



ఎండపల్లి, నవంబర్ 7, ప్రజా జ్యోతి:భూ రికార్డుల ఆధునీకరణ, భూముల హద్దులపై స్పష్టత తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ-సర్వే కార్యక్రమం ఎండపల్లి మండలంలో కొనసాగుతోంది.నాలుగు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతులకు సర్వే ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సీసీఎల్ఏ హైదరాబాద్,జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీ సోమవారం నుంచి శానబండ గ్రామంలో రీ-సర్వే పనులు ప్రారంభించనున్నట్లు మండల రెవెన్యూ అధికారులు వెల్లడించారు. సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండి సరిహద్దుల గుర్తింపునకు సహకరించాలని సూచించారు. భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, లింక్ దాక్యుమెంట్లు, ఆధార్ కార్డు నకళ్లను సర్వే బృందానికి చూపించాలని కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టనున్న ఈ సర్వే విజయవంతంగా పూర్తయ్యేందుకు భూ యజమానులు, సరిహద్దు రైతులు, మండల అధికారులు సర్వే బృందానికి పూర్తి సహకారం అందించాలని ఒక ప్రకటనలో కోరారు.

సీపీఐ నాయకుడు మౌలానా మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సంతాపం

► మౌలానా కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి



కోరుట్ల,నవంబర్ 07ప్రజాజ్యోతి సీపీఐ నాయకుడు మౌలానా మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శనివారం మౌలానా నివాసానికి వెళ్లిన ఆయన,మౌలానా కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.మౌలానా మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

ఆర్థిక పరిస్థితి బాగులేనోళ్లను ఆదుకుంటున్న బొజేందర్ రెడ్డి



గొల్లపల్లి నవంబర్ 7ప్రజాజ్యోతి గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ గ్రామానికి చెందిన జక్కుల రామేశ్వరి క్యాన్సర్ తో అలాగే చందోలి గ్రామానికి చెందిన పిట్టల రమేష్ డెంగ్యూ జ్వరం తో మరణించగా శంకర్ రావు పెట్ గ్రామానికి చెందిన ఎడమల భోజేందర్ రెడ్డి వారి కుటుంబాలను పరామర్శించడం జరిగింది వారి యొక్క ఆర్థిక పరిస్థితి దృష్ట్య రెండు కుటుంబాలకు చెరో 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది అని అన్నారు వారి కుటుంబాలకు మనోధైర్యం అందించారు ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు అవారి చందు మాజీ సర్పంచ్ అలిశెట్టి రవీందర్ బూసరపు సిద్ధూ మొగిలి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పసుపు, మామిడి తోటలను పరిశీలించిన పొలాస శాస్త్రవేత్తలు



రాయికల్, నవంబర్ 07 (ప్రజా జ్యోతి) రాయికల్ మండలం ఆలూర్ గ్రామ పరిధిలోని పసుపు పంట పొలాలు, మామిడి తోటలను పొలాస వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ స్వాతి, రవి పరిశీలించారు. ఈ సందర్భంగా పంటల్లో కనిపిస్తున్న చీడపీడలు, పోషక లోపాల నివారణకు రైతులకు పలు యాజమాన్య సూచనలు చేశారు.పసుపులో మారాకు తెగులు నివారణకు ప్రొపికోనాజోల్ 1 మి.లీ./లీటరు నీటికి, జింక్ లోప నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రా./లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. దుంపకుళ్లు తెగులు నివారణకు మెటలాక్సిల్ 1.5 గ్రా./లీటరు నీటికి కలిపి వినియోగించాలని తెలిపారు. మామిడి పూత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు,మచ్చ తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా./లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లాల స్వామి,పీఏసీఎస్ చైర్మన్ రాజారెడ్డి,మాజీ సర్పంచ్ మెక్కొండ రాంరెడ్డి,రాజు, శేఖర్,రాజకుమార్,లక్ష్మీనారాయణ,సుధాకర్ తదితర రైతులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యతకు తిలోదకాలు ?

♦ పప్పులో నీళ్లే తప్ప పప్పు లేదంటూ విద్యార్థుల ఆవేదన,





ఎండపల్లి, నవంబర్ 7 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాల్సిన మధ్యాహ్న భోజన పథకం గుల్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్లక్ష్యానికి గురవుతోంది. 134 మంది విద్యార్థులకు కేవలం అరకిలో బెండకాయలతో కూర వండటం, పప్పులో నీళ్లే ఎక్కువగా ఉండటంపై విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. భోజనం తినలేక ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నామని సర్పంచ్, గ్రామస్థులకు ఫిర్యాదు చేశారు.దీంతో సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్‌గౌడ్,గ్రామ కార్యదర్శి కొమురయ్య, వార్డు సభ్యులు శనివారం పాఠశాలను సందర్శించి భోజనాన్ని పరిశీలించారు. కూర, పప్పు నాణ్యతపై విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఎంఈఓ, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

నిర్వాహకురాలి వివరణ

శనివారం మరో వంటమనిషి రాకపోవడంతో ఇద్దరమే వంట చేశామని నిర్వాహకురాలు క్యాతం లక్ష్మి తెలిపారు. విద్యుత్ సరఫరా లేక నీళ్లు మోసుకురావాల్సి రావడంతో, సమయానికి భోజనం సిద్ధం చేసే క్రమంలో కూర పలుచగా తయారైందని వివరించారు. మరోసారి ఇలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

నాణ్యతపై నిర్లక్ష్యం చేస్తే సహించం: ఎంఈఓ

ఫిర్యాదు మేరకు పాఠశాలను సందర్శించి విద్యార్థులను విచారించినట్లు ఎంఈఓ సముద్రాల హరికృష్ణ తెలిపారు. భోజనం రుచికరంగా ఉండటం లేదని విద్యార్థులు చెప్పడంతో వంట నిర్వాహకులను మందలించామని, ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడికి సూచించామని వెల్లడించారు.

ఉపాధి పనుల నిర్వహణపై మేట్లకు దిశానిర్దేశం





కొడిమ్యాల,నవంబర్ 7,(ప్రజాజ్యోతి): ఉపాధి హామీ పనుల నిర్వహణలో మేట్లు కీలక పాత్ర పోషించాలని ఎంపీడీవో స్వరూప సూచించారు. శనివారం మండలంలోని పూడూరు రైతు వేదికలో వివిధ గ్రామాలకు చెందిన 55 మంది ఎంపిక చేసిన మేట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నీటి సంరక్షణ పనులు,మేట్ల విధులు, బాధ్యతలు,పనుల కొలతలు, కూలీల హాజరు నమోదు,పని ప్రదేశంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం అనుమండ్ల అజయ్‌రెడ్డి మామిడి తోటలో నిర్మించిన ఫామ్‌పాండ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం,ఏపీవో సతీష్,టెక్నికల్ అసిస్టెంట్లు శ్రీను,భువన్,గౌతమి,పంచాయతీ కార్యదర్శి నవీన్, ఫీల్డ్ అసిస్టెంట్లు,తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్ల గుర్తింపు

• ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలి: పోలీసుల సూచన



మేడిపల్లి,నవంబర్ 7 ప్రజా జ్యోతి రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జాతీయ రహదారిపై ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్లు) పోలీసు, ఆర్‌అండ్‌బీ అధికారులు సంయుక్తంగా గుర్తించారు.ఈ మేరకు కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొమ్ము తిరుపతి,మేడిపల్లి ఎస్ఐ ఎం.శ్రీధర్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి, భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై చర్చించారు. బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. దీనిపై స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారి వినీత్ గుర్తించిన బ్లాక్ స్పాట్లను నమోదు చేసుకొని, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల సీఐ కొమ్ము తిరుపతి, మేడిపల్లి ఎస్ఐ ఎం. శ్రీధర్ రెడ్డి, ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామమే లక్ష్యం

♦ రెండవ రోజు వ్యర్థాల తొలగింపు.. అవగాహన ర్యాలీ

కొడిమ్యాల,నవంబర్ 7,(ప్రజాజ్యోతి): మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శీతాకాల శిబిరం రెండో రోజు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి,ప్రజలకు అవగాహన కల్పించారు.పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ పి.గోపాల్ ఆధ్వర్యంలో సామాజిక చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి వెంగలి నాగరాజు సామాజిక గీతాలు ఆలపించగా,అక్కనపెల్లి కరుణాకర్ విద్యార్థులకు చదువు ప్రాధాన్యం, నాయకత్వ లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి బండ్ల భాస్కర్, అధ్యాపకులు చిట్టె నర్సయ్య, వాలంటీర్లు పాల్గొన్నారు.



